ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 30.7 ; కనిష్ఠం 17.5



నిర్మల్
జిల్లా వార్తలు
8
మంగళవారం 25 నవంబరు 2025

ఉచిత సోలార్ శిక్షణ

నిర్మల్ రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : నిరుద్యోగుల కోసం నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోలార్ ఎనర్జీ సహకారంతో గ్రీన్ ఉర్జ టెక్నాలజీ అండ్ సిస్టమ్ ఆధ్వర్యంలో సూర్యమిత్ర పేరుతో నిర్మల్ రాజీవ్ గాంధీ ఐటీఐలో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ప్రాజెక్టు డైరెక్టర్ అమిత్ దేశ్ పాండే తెలిపారు. శిక్షణలో చేరిన వారికి భోజన వసతి కల్పిస్తున్నట్లు వివరించారు. రెసిడెన్షియల్ విధానంలో 90 రోజులు కొనసాగే ఈ కోర్సులో చేరేందుకు ఐటీఐ లేదా డిప్లొమా పూర్తి చేసిన వారు అర్హులన్నారు.



ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

ప్రజావాణి దరఖాస్తులు
త్వరగా పరిష్కరించండి

» జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ చైన్‌గేట్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ దరఖాస్తును పరిశీలించి తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పని చేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమం అనంతరం కార్మిక శాఖకు సంబంధించిన, కార్మికుల ప్రమాద బీమా పెంపు సమాచార గోడ ప్రతులను కలెక్టర్, అధికారులు ఆవిష్కరించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఆర్డీవో రత్న కళ్యాణి, జడ్పీ సీఈవో గోవింద్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



పల్లెపోరుకు రిజర్వేషన్ల
ఖరారు

» 400 గ్రామ పంచాయతీలకు ప్రక్రియ పూర్తి
» 188 జనరల్, 72 బీసీ, 69 ఎస్సీ, 73 ఎస్టీ స్థానాలకు రిజర్వేషన్లు
» వారం రోజులుగా తలామునకలై లెక్కలు తేల్చిన అధికారులు
» పంచాయతీ ఎన్నికల ఏర్పాట్లలో యంత్రాంగం బిజీ

నిర్మల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎట్టకేలకు గ్రామ పంచాయతీల పదవులకు సంబంధించిన రిజర్వేషన్‌ల ప్రక్రియ పూర్తయ్యింది. వారం రోజుల నుంచి అధికారులు రిజర్వేషన్‌ల ప్రక్రియపై పకడ్బందీగా కసరత్తు పూర్తి చేశారు. మొదట రిజర్వేషన్‌లపై అభ్యంతరాలు రావడంతో మరోసారి కుల గణన, 2011 జనాభా లెక్కల ఆధారంగా రిజర్వేషన్‌లను ఖరారు చేశారు. బీసీలకు ఈ రిజర్వేషన్‌ల ఖరారులో ఆశించిన మేరకు ప్రాతినిధ్యం దక్కలేదంటూ అసంతృప్తి వ్యక్తమవుతోంది. కొన్ని మండలాల్లో బీసీల జనాభా అత్యధికంగా ఉన్నప్పటికీ ఐదారు గ్రామ పంచాయతీలను మాత్రమే బీసీలకు రిజర్వ్ చేయడం అసంతృప్తికి కారణమవుతోంది. పలు మండలాల్లో కేవలం ఒక్క గ్రామ పంచాయతీ మాత్రమే బీ.సీలకు రిజర్వ్ కావడం చర్చకు తావిస్తోంది. అయితే ఈ సారి ఎస్సీ, ఎస్టీలకు మాత్రం రిజర్వేషన్‌లు కొంత మేరకు సంతృప్తిని చ్చాయంటున్నారు. మొత్తం జిల్లాలో 400 గ్రామ పంచాయతీలకు గానూ 188 జనరల్ కింద రిజర్వ్ అయ్యాయి. బీ.సీలకు 72, ఎస్సీలకు 69, ఎస్టీలకు 73 గ్రామ పంచాయతీలను రిజర్వ్ చేశారు. ఇందులో నుంచి మహిళలకు కూడా అత్యధిక ప్రాధాన్యతనిచ్చారు.

సిద్ధమవుతున్న అధికారులు

ఎట్టకేలకు రిజర్వేషన్‌ల ప్రక్రియ పూర్తి కావడంతో ఎన్నికల ఏర్పాట్లకు సంబంధించి సమాయత్తమవుతోంది. ఒకటి రెండు రోజుల్లో ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశాలున్నట్లు ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లపై దృష్టి సారిస్తున్నారు. ఇప్పటికే సగానికి పైగా ఈ ప్రక్రియను పూర్తి చేసిన అధికారులు ఇక మిగతా పనుల కోసం సిద్ధమవుతున్నారు.

మహిళలకు ఆశించిన మేరకు ప్రాతినిధ్యం

మహిళలకు ఈ సారి 182 గ్రామ పంచాయతీలను మహిళలకు రిజర్వ్ చేయడం ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. 89 గ్రామ పంచాయతీలు జనరల్ మహిళలకు కేటాయించారు. బీసీ మహిళలకు 31 గ్రామ పంచాయతీలు, ఎస్సీ మహిళలకు 37, ఎస్టీ మహిళలకు 35 గ్రామ పంచాయతీలను కేటాయించారు. అయితే పెంబి, దస్తురాబాద్ మండలాల్లో కేవలం ఒక్కో గ్రామ పంచాయతీని మాత్రమే బీసీలకు కేటాయించడం చర్చకు తావిస్తోంది. కాగా బీసీలకు ఆశించిన మేరకు గ్రామ పంచాయతీలు రి జర్వ్ కాలేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. లక్ష్మణచాంద మండలంలో 04, నర్సాపూర్‌లో 03, మామడలో 03, సారంగాపూర్‌లో 05, నిర్మల్‌లో 05, సోన్‌లో 04, దిలావర్‌పూర్‌లో 02, ఖానాపూర్‌లో 04, కడెంలో 03, బాసరలో 03, భైంసాలో 08, కుంటాల లో 04, లోకేశ్వరంలో 04, ముథోల్‌లో 05, కుభీర్‌లో 05, తానూర్‌లో 08 గ్రామ పంచాయతీలు బీ.సీలకు రిజర్వ్ అయ్యాయి. బీ.సీ జనాభా అధికంగా ఉన్న మండలాల్లో కూడా ఆ వర్గానికి ఆశించిన మేరకు ప్రాతినిధ్యం దక్కలేదని అంటున్నారు. చాలా గ్రామ పంచాయతీలు జనరల్‌కు రిజర్వ్ కావడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఎన్నికల దిశగా పార్టీలు

ఇదిలా ఉండగా రాజకీయ పార్టీలు గ్రామ పంచాయతీ ఎన్నికల కోసం సిద్ధమవుతున్నాయి. ఎన్నికలు పార్టీల గుర్తులకు అతీతంగా జరగనున్నప్పటికీ అన్ని పార్టీలు మాత్రం తమ మద్దతుదారులను బరిలోకి దింపడం సహజమేనని అంటున్నారు. ఇప్పటికే ఆయా పార్టీల నుంచి సర్పంచ్ పదవులకు పోటీ చేసే వారు సిద్ధమవుతున్నారు. దీంతో పాటు ఆయా ప్రధాన రాజకీయ పార్టీలు సైతం బలమైన అభ్యర్థులను బరిలోకి దించేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టాయని అంటున్నారు. గుర్తులు లేకున్నప్పటికీ పార్టీలు తమ అభ్యర్థులను పరోక్షంగా ప్రకటించనున్నట్లు చెబుతున్నారు. రాజకీయ పార్టీలన్నీ ఇక తమ కార్యకలాపాలను ముమ్మరం చేయబోతున్నాయి.

వైభవంగా దత్తాత్రేయుని ఆలయ వార్షికోత్సవ వేడుకలు



బాధనకుర్తి గ్రామంలో దత్తాత్రేయునికి నవరసాభిషేకం నిర్వహిస్తున్న భక్తులు

ఖానాపూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బాధనకుర్తి గ్రామంలో గల అతి పురాతన దత్తాత్రేయుని పాదుకా క్షేత్రం ఆలయ వార్షికోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ వేడుకల్లో భాగంగా సోమవారం ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి నవరసాభిషేకము నిర్వహించారు. అనంతరం గ్రామంలోని స్వామివారి పల్లకిని అంగరంగ వైభవంగా ఊరేగించారు. పల్లకి సేవకు మహిళలు మంగళహారతులతో తరలివచ్చి శోభాయాత్రలో పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న
సినీ నటుడు



బాసర, నవంబరు24(ఆంధ్రజ్యోతి) : బాసర సరస్వతి అమ్మవారిని సోమవారం సినీ నటుడు టార్జాన్ లక్ష్మీనారాయణ కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తన మనవడికి అక్షరాభ్యాస పూజలు నిర్వహించారు. ఈయన వెంట బాసర బీజేపీ పట్టణ అధ్యక్షుడు సుభాష్‌యాదవ్ ఉన్నారు.



ల్యాబ్‌లోని పరికరాలను పరిశీలిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

శాస్త్ర ప్రయోగశాలల ద్వారా విద్యార్థులకు
ప్రయోగాత్మక విద్య

» రాష్ట్ర ఎక్సైజ్, ప్రొహిబిషన్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

సోన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : విజ్ఞాన శాస్త్ర ప్రయోగశాలల ద్వారా విద్యార్థులకు ప్రయోగాత్మక విద్య అందుతుందని రాష్ట్ర ఎక్సైజ్, ప్రొహిబిషన్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. సోమవారం సోన్ మండలం లెఫ్ట్ పోచంపాడ్ గ్రామంలోని బాల బాలికల ప్రభుత్వ సాంఘిక సంక్షేమ పాఠశాల, కళాశాలలో 13.50 లక్షల వ్యయంతో నెలకొల్పిన విజ్ఞాన శాస్త్ర ప్రయోగశాలను మంత్రి జూపల్లి, ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌లతో కలిసి ప్రారంభించారు. విజ్ఞాన శాస్త్ర ప్రయోగశాలను ప్రారంభించిన మంత్రి, ల్యాబ్‌లోని పరికరాలను పరిశీలించారు. మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థుల సాంకేతిక నైపుణ్యాలు పెంపుదల కోసం ప్రైవేట్ విద్యాసంస్థలకు దీటుగా విజ్ఞాన శాస్త్ర ప్రయోగశాలల ద్వారా విద్యార్థుల పరిజ్ఞానం పెంపొందడమే కాకుండా వారిలో విజ్ఞాన శాస్త్రంపై జ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్న కుతూహలం పెరుగుతుందన్నారు. విద్యార్థులతో మాట్లాడుతూ... ల్యాబ్‌లో పొందుపరిచిన పరికరాల వివరాలను వారిని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న మంత్రి జూపల్లి, జిల్లా కలెక్టర్, గోడం నగేష్



ఎన్‌సీసీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఎన్‌సీసీ విద్యార్థులు

ఎన్‌సీసీ విద్యార్థుల భారీ ర్యాలీ

» గవర్నమెంట్ ఆస్పత్రిలో రోగులకు పండ్ల పంపిణీ
» ఘనంగా ఎన్‌సీసీ డే వేడుకలు

నిర్మల్ చైన్‌గేట్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఎన్‌సీసీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని స్థానిక జుమ్మెరాత్‌పేట్ హైస్కూల్ ఎన్‌సీసీ క్యాడెట్లు నిర్మల్‌లో భారీ ర్యాలీ నిర్వహించారు. పాఠశాల నుండి ప్రారంభమైన ఈ ర్యాలీ పట్టణ వీధుల గుండా సాగింది. ఈ సందర్భంగా క్యాడెట్లు ఎన్‌సీసీ విశిష్టతను వివరిస్తూ నినాదాలు చేశారు. అనంతరం ఎన్‌సీసీ క్యాడెట్లు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ ఆఫీసర్ ప్రసూయ, అబ్జర్వర్లు ఎం.శ్రీనివాస్, గంగాధర్ భోస్లేలు మాట్లాడుతూ క్రమశిక్షణకు ఎన్‌సీసీ క్యాడెట్లు మారుపేరుగా నిలుస్తున్నారన్నారు. ఎన్‌సీసీ క్యాడెట్లు చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. అనేక విపత్కర పరిస్థితుల సమయంలో ఎన్‌సీసీ క్యాడెట్లు ధైర్యంగా తమ సేవలు అందించి మానవతా దృక్పథాన్ని చాటుకున్నారన్నారు. భవిష్యత్తులో ఎన్‌సీసీ క్యాడెట్లు మ రింతగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ ఆఫీసర్ ప్రసూయతో పాటు పాఠశాల హెడ్‌మాస్టర్ అల్లం రవిబాబు, టీచర్లు మనోహర్, హేమలత, మంజుల, నాగలత, హారిక, కూన శృతి, వసంతరావు, గంగాధర్, మల్లేశం, దత్తురాం, దయానంద్, తదితరులు పాల్గొన్నారు.

టైలరింగ్, డ్రాయింగ్ పరీక్షల ఫీజు
ఐదు లోపు చెల్లించాలి : డీఈవో

ముథోల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పరీక్షల విభాగం ద్వారా నిర్వహించే టైలరింగ్, డ్రాయింగ్ పరీక్షల కొరకు ఆసక్తి గల అభ్యర్థులు ఫీజును డిసెంబరు 5లోపు చెల్లించాలని నిర్మల్ జిల్లా విద్యాశాఖ అధికారి దర్శనం భోజన్న తెలిపారు. ఈ పరీక్షలు జనవరి, ఫిబ్రవరి 2026లో నిర్వహించబడతాయని వెల్లడించారు. డ్రాయింగ్‌లో లోయర్ గ్రేడ్‌కు ఫీజు రూ. 100, హయ్యర్ గ్రేడ్‌కు ఫీజు రూ. 150, టైలరింగ్ ఎంబ్రాయిడింగ్‌కు ఫీజు రూ. 100, టైలరింగ్ హయ్యర్ గ్రేడ్‌కు ఫీజు రూ. 200 చెల్లించాలని తెలిపారు. అభ్యర్థులు కనీసం ఏడో తరగతి ఉత్తీర్ణులై ఆయా అంశాలలో శిక్షణ పొందిన వారు అర్హులని పేర్కొన్నారు. ఈ పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారికి టెక్నికల్ కోర్స్ సర్టిఫికెట్ జారీ చేయబడుతుందని వెల్లడించారు. ఆసక్తి గల అభ్యర్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ.తెలంగాణ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకొని, దాని హార్డ్ కాపీలను జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో సమర్పించాలని తెలియజేశారు. వెబ్‌సైట్‌లో చూపబడిన హెడ్స్‌పై అభ్యర్థులు బ్యాంకులో చలాన్ ద్వారా ఫీజు చెల్లించాలని, డీడీలు గాని ఇతరత్రా గాని అంగీకరించబడవని చెప్పారు.

నూతన విత్తన చట్టంపై చర్చలో భాగస్వాములు కావాలి



డీలర్లతో సమావేశం ఏర్పాటు చేసిన అధికారులు

పెంబి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువస్తున్న నూతన విత్తన చట్టంపై చర్చలో భాగ స్వామ్యం కావాలని ఏవో నవీన్ అన్నారు. సహకార సంఘాల సభ్యులు, నాయకులతో మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో సామూహిక చర్చ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువస్తున్న నూతన విత్తన చట్టం ముసాయిదా లోని లోటుపాట్లపై రైతులు, విత్తన డీలర్లు, అధికారులు, సహకార సంఘాల సభ్యులు, నాయకులతో మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో సామూహిక చర్చ నిర్వహించనున్నట్లు తెలిపారు.

నర్సాపూర్ మండలంలో
బీసీలకు అగ్రస్థానం

» 13 గ్రామాల్లో 17 స్థానాలు రిజర్వ్
» గొల్లమాడలో సర్పంచ్ బరిలో బీసీ మహిళ

నర్సాపూర్(జి), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్ల పట్టిక ప్రకారం నర్సాపూర్ మండలంలో వెనుకబడిన తరగతులకు (బీసీ) చెప్పుకోదగిన ప్రాతినిధ్యం లభించింది. పరిశీలించిన 13 గ్రామాలు, తండాల్లో బీసీ వర్గానికి మొత్తం 17 స్థానాలు ప్రత్యేకంగా కేటాయించబడ్డాయి. ఇది సామాజిక న్యాయం. అన్ని వర్గాలకు రాజకీయ భాగస్వామ్యం కల్పించడంలో మండల యంత్రాంగం తీసుకున్న ముఖ్యమైన ముందడుగుగా పరిగణించవచ్చు.

అత్యధిక ప్రాతినిధ్యం ఉన్న గ్రామాలు...

నర్సాపూర్(జి)లోని మొత్తం 14 స్థానాలకు గాను 4 స్థానాలు (బీసీ(ఎం/డబ్ల్యూ)-3, బీసీ(డబ్ల్యూ)-1) బీసీ వర్గానికి రిజర్వ్ అయ్యాయి. నర్సాపూర్(జి)లోని 4 బీసీ స్థానాల్లో ఒక స్థానం బీసీ మహిళకు ప్రత్యేకంగా కేటాయించబడింది. చాక్‌పెల్లిలో 10 స్థానాలకు 3 స్థానాలు (బీసీ(ఎం/డబ్ల్యూ)-2, బీసీ(డబ్ల్యూ)-1) బీసీ వర్గానికి కేటాయించబడ్డాయి. తిమ్మాపూర్‌లో 8 స్థానాలకు 3 స్థానాలు (బీసీ(ఎం/డబ్ల్యూ)-2, బీసీ(డబ్ల్యూ)-1) బీసీ వర్గానికి దక్కాయి.

గొల్లమాడ సర్పంచ్ బరిలో బీసీ మహిళా నాయకురాలు...

మండలంలో బీసీ రిజర్వేషన్లు అలమవుతున్న వేళ మహిళా సాధికారతకు నిదర్శనంగా గొల్లమాడ గ్రామ పంచాయతీ నుంచి ఒక కీలక ప్రకటన వెలువడింది. గొల్లమాడ సర్పంచ్ స్థానం జనరల్ మహిళ (యూఆర్(డబ్ల్యూ)గా రిజర్వ్ కావడంతో అదే గ్రామానికి చెందిన బీసీ మహిళా నాయకురాలు చెన్న రోజారాణి సర్పంచ్‌గా పోటీలో ఉంటానని ధైర్యంగా ప్రకటించారు. మండలంలో బీసీలకు ఈ స్థాయిలో రిజర్వేషన్లు అమలు కావడం హర్షణీయం. ఇది వెనుకబడిన వర్గాలకు రాజకీయ భాగస్వామ్యాన్ని పెంచుతుంది. మహిళలకు కూడా రిజర్వేషన్లు దక్కడం గొప్ప విషయం. ఈ రిజర్వేషన్లు చెన్న రోజారాణి వంటి అభ్యర్థులు ముందుకు రావడం, బీసీ వర్గానికి చెందిన అ భ్యర్థులు స్థానిక పరిపాలనలో చురుకుగా పాల్గొనడానికి, తమ స మస్యలను పరిష్కరించడానికి, మండల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించడానికి ఒక చక్కటి అవకాశాన్ని కల్పిస్తున్నాయి. ఈ కేటాయింపులు తమ వర్గానికి మంచి ప్రాతినిధ్యం లభించిందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



శ్రీ కదిలి పాపహరేశ్వర స్వామికి అభిషేకం చేస్తున్న దంపతులు

ఆస్ట్రేలియా నుంచి వచ్చి.. మొక్కులు చెల్లించి..

దిలావర్‌పూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆస్ట్రేలియా నుంచి వచ్చిన ఓ జంట సోమవారం శ్రీ కదిలి పాపహరేశ్వర స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. నిర్మల్‌కు చెందిన నాయని కార్తీక్ ఆస్ట్రేలియాలో హనాను గతంలో ప్రేమించి హిందూ సాంప్రదాయం ప్రకారం పెళ్లి చేసుకున్నారు. అనంతరం వారిద్దరూ కుటుంబ సభ్యులతో కలిసి కదిలి పాపహరేశ్వర స్వామిని దర్శించుకుని మొక్కుకున్నారు. అయితే వారికి పండంటి మగబిడ్డ జన్మించడంతో తిరిగి ఆస్ట్రేలియా నుంచి ఆ బిడ్డతో వచ్చి సోమవారం కదిలి పాపహరేశ్వర స్వామిని, మాత అన్నపూర్ణేశ్వరిని దర్శించుకుని అభిషేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆ జంటను దేవస్థానం చైర్మన్ వెంకట్ రావు, జూనియర్ అసిస్టెంట్ మాధవ్ రావు పటేల్ శాలువాతో సత్కరించారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దృశ్యం

లీడ్ ఇండియా ఆధ్వర్యంలో విద్యార్థులకు శిక్షణ

నిర్మల్ రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : లీడ్ ఇండియా (కలాం ఫౌండేషన్) హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో రాష్ట్ర ట్రస్మా సహకారంతో ప్రైవేట్ పాఠశాలలోని 6 నుంచి 10వ తరగతుల విద్యార్థులకు 'ఆప్ బడో, దేశ్ కో బడావో' శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు లీడ్ ఇండియా శిక్షణ సమన్వయకర్త శ్రీనివాస్ ఆచార్య తెలిఇపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటికే రవి, శాంతినికేతన్, శ్రీవాణి, ప్రిన్స్ హైస్కూల్ నిర్మల్ పాఠశాలలో ఈ తరగతులు ప్రారంభించబడ్డాయని తెలిపారు. ఈ కార్యక్రమం వలన పిల్లల్లో దాగి ఉన్న మానసిక శక్తి సామర్థ్యాలను వెలికి తీసి వారిలో నైపుణ్య, మానసిక, శారీరక, మానవత, శాస్త్రీయ జిజ్ఞాసలను పెంపొందించడం ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీవాణి స్కూల్ కరస్పాండెంట్ చంద్రాగౌడ్, ట్రస్మా సెక్రటరీ పద్మనాభ గౌడ్ పాల్గొన్నారు.



ప్రీ ప్రైమరీ తరగతులను ప్రారంభిస్తున్న మండల విద్యాధికారి తోడిశెట్టి పరమేశ్వర్

కూచన్‌పల్లిలో ప్రీ ప్రైమరీ తరగతులు ప్రారంభం

సోన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కూచన్‌పల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రీ ప్రైమరీ తరగతులను మండల విద్యాధికారి తోడిశెట్టి పరమేశ్వర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మూడేళ్ల వయస్సు దాటిన విద్యార్థులకు సొంత గ్రామాల్లోని నర్సరీ పూర్వ ప్రాథమిక పాఠశాల విద్య లభించడం సంతోషకరమన్నారు. ఈ సెంటర్‌లో విద్యార్థులకు అవసరమయ్యే ఆట పరికరాలు, బోధన అభ్యసన పరికరాలు తొందరలోనే రానున్నాయని ఆయన అన్నారు. ఈ సందర్భంగా బోధకురాలిగా, ఆయాగా నియమించబడిన ప్రమీల, కావేరిలను ప్రధానోపాధ్యాయులు, గ్రామస్థులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేశ్వర్, మాజీ సర్పంచ్ బండి లింగన్న, శేఖర్, వీడీసీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



చీరలు పంపిణీ చేస్తున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి: కోవ

నార్నూర్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను ప్రతీఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మీ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ప్రభుత్వం ఇందిరమ్మ నమూనా గృహాన్ని ప్రారంభించి మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో కాంట్రాక్టర్లు నాణ్యత పాటించేలా చూడాలని హౌసింగ్ ఏఈ శ్రీకాంత్‌కు సూచించారు. ఈ అనంతరం గాదిగూడ మండల కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ జాడి రాజాలింగం, ఎంపీడీవో పుల్లారావ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దేవ్‌రావు లోకండే, పాక్స్ ఇన్‌చార్జి చైర్మన్ ఆడె సురేష్, ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సోయం మారుతి, మాజీ వైస్ చైర్మన్ తొడసం నాగోరావ్, మాజీ జడ్పీటీసీ హేమలత బ్రిజ్‌లాల్, సహకార సంఘం డైరెక్టర్ దుర్గే కాంతారావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మెస్రం హన్మంత్ రావ్, లోకండే దేవరావ్, సయ్యద్ ఖాసిం, ఉద్ధవ్ కాంబ్లే పాల్గొన్నారు.

గ్రామీణులకు అందుబాటులో ఉండాలి

నేరడిగొండ, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): అంబులెన్స్ వాహనాలను గ్రామీణ ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉంచి, మెరుగైన వైద్య సేవలు అందించాలని జీవీకే సంస్థ ప్రోగ్రాం మేనేజర్ సమ్రాట్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో 108 అంబులెన్స్‌ను తనిఖీ చేశారు. అంబులెన్స్ పనితీరు, పరికరాలను పరిశీలించారు. అత్యవసర సమయంలో స్పందించి మెరుగైన వైద్యం అందేలా కృషి చేయా లన్నారు. ఇందులో జిల్లా కోఆర్డినేటర్ రాజశేఖర్, 108 పైలెట్ ప్రశాంత్, ఈఎంటీలు రాకేష్ పాల్గొన్నారు.

సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలి

బజార్‌హత్నూర్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సామాజిక సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని ప్రిన్సిపాల్ సునీల్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జ్ఞానేశ్వర్ సిందేలు అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో కొలారి గ్రామంలో సోమవారం ఎన్ఎస్ఎస్ శీతాకాల ప్రత్యేక శిబిరాన్ని ప్రారంభించారు. ఎన్ఎస్ఎస్ జాతీయ పథకం విద్యార్థుల నాయకత్వపు లక్షణాలకు ఒక వరమని, విద్యార్థులు సామాజిక కార్యక్రమాల్లో ముందు వరుసలో ఉండాలన్నారు. ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు దోహదపడే పథకమన్నారు. ఈ సందర్భంగా పలు సామాజిక కార్యక్రమాలపై విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సుభాష్, అశోక్ రెడ్డి, అహ్మద్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.



కొలారిలో ఎన్ఎస్ఎస్ శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

విద్యార్థుల జీవితాలకు.. మార్గదర్శకులు టీచర్లే

» ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మాట్

» కొమురం భీం ప్రాంగణంలో గిరిజన సంక్షేమ ఉపాధ్యాయులకు శిక్షణ

ఉట్నూర్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): టీచర్లే విద్యార్థుల జీవితాలకు మార్గదర్శకులని ప్రతీ విద్యార్థి యొక్క భవిష్యత్తును తీర్చిదిద్దే మహాక్రతువును ఉపాధ్యాయులే నిర్వహిస్తారని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మాట్ అన్నారు. మండల కేంద్రంలోని కొమురంభీం ప్రాంగణం ఉన్న పీఎంఆర్సీ సమావేశ మందిరంలో గిరిజన సంక్షేమ ఉపాధ్యాయులకు నిర్వహించిన ఐదు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు అందుకుగాను నిరంతరం తమను తాము లక్ష్యాలు ఏర్పాటు చేసుకుని తమ నైపుణ్యాలను మెరుగుపరుస్తూ నాణ్యమైన విద్యను అందించాలన్నారు. అంతేకాకుండా గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించుటకు విద్యార్థులకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్లాలని అన్నారు. ఆదిలాబాద్, నిర్మల్, జగిత్యాల జిల్లాల ప్రధానోపాధ్యాయులు జీవశాస్త్ర ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఉపాధ్యాయ శిక్షణ తరగతులు లోగో, ఉపాధ్యాయ కరదీపికలను డిప్యూటీ డైరెక్టర్ అంబాజి జాదవ్‌తో కలిసి ఆవిష్కరించారు. అన్ని కేటగిరీలో ఉపాధ్యాయుల విడతల వారీగా శిక్షన తరగతులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీఎంవో జగన్, టి.దేవరావు, ప్రధానోపాధ్యాయులు, రిసోర్స్ పర్సన్‌లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మాట్

రాజ్యాంగ దినోత్సవాన్ని జయప్రదం చేయాలి

● రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు ఈశ్వరీబాయి

ఇంద్రవెల్లి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగం మహిళలకు ఇచ్చిన హక్కులతోనే రాష్ట్రపతి, ప్రధాని, సీఎం, మంత్రి వంటి పదవులు పొందారని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరీబాయి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఆమె నివాసంలో అంబేద్కర్ సంఘాల నాయకులతో కలిసి రాజ్యాంగ దినోత్సవ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారత రాజ్యాంగం సమాజంలోని అన్ని వర్గాల మహిళలకు సమాన హక్కులు లభిస్తాయని ఆమె ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ నెల 26న ఇంద్రవెల్లిలో జరగనున్న రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు సోన్ కాంబ్లే జితేందర్, ప్రధాన కార్యదర్శి కాంబ్లే మారుతి, కోశాధికారి కాంబ్లే ఉత్తం, సావంత్ లహుదాస్, కాంబ్లే అతీష్, బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కుమ్ర ఈశ్వరీబాయి

రాజ్యాంగబద్ధంగానే గిరిజనులయ్యాం

● గిరిజన లైవ్ జిల్లా అధ్యక్షుడు మహేందర్ జాదవ్

నేరడిగొండ, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): తాము రాజ్యాంగబద్ధంగానే ఎస్టీ జాబితాలో చేరామని, దొడ్డి దారిలో రాలేదని గిరిజన లంబాడీ ఐక్యవేదిక ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు మహేందర్ జాదవ్ స్పష్టం చేశారు. లంబాడీలు కష్టపడి చదివి ఉద్యోగాలు సాధిస్తున్నారని తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. అధికార పార్టీ నేతల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'విభజించు-పాలించు' అనే ఎత్తుగడతో ప్రభుత్వాలు నడుస్తున్నాయని, ఇది ఆదివాసీలు మరియు లంబాడీల మధ్య చిచ్చుపెట్టి ఘర్షణలకు దారితీస్తోందని ఆరోపించారు. ఆదివారం జరిగిన ఉట్నూర్ 'ఆదివాసీ పోరు సభ'లో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు చేసిన వ్యాఖ్యలు ఇరు వర్గాల మధ్య వైషమ్యాలు పెంచేలా ఉన్నాయని అన్నారు. వెంటనే ఆయన్ను కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అందరి ఓట్లతో గెలిచిన ఎమ్మెల్యేలు, కేవలం ఒక వర్గం (ఆదివాసీ సమాజం) వైపే మొగ్గు చూపడం సరికాదని హితవు పలికారు. తమ స్థాయిని మరిచి మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు, ఎంపీలు ఖబడ్దార్ అంటూ హెచ్చరించారు. రాష్ట్రంలో అనేక సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించడం మానేసి, లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలనే అంశంపైనే నాయకులు దృష్టి పెట్టడం శోచనీయమన్నారు. ఇది లంబాడీల మనోభావాలను దెబ్బతీయడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. తాము మౌనంగా ఉన్నామని రెచ్చగొడితే ఊరుకునేది లేదని, విమర్శలు కొనసాగితే పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాల్సి వస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జి పాండు రాథోడ్, మండల జిల్లా నాయకులు సతీష్, అర్జున్, సునీల్, రాజు, సందీప్, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీపై.. ఫోకస్

(5వ పేజీ తరువాయి...)

వారిని గెలిపించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. పార్టీల వారీగా అభ్యర్థులను బరిలోకి దింపేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. కార్యకర్తలు కూడా తమ పార్టీకి చెందిన వారికే మద్ధతుగా నిలుస్తున్నారు. దీంతో గ్రామాల్లో పోటాపోటీ వాతావరణం కనిపిస్తుంది. పార్టీ గుర్తు లేకపోయినా ప్రధాన పార్టీలు పంచాయతీ ఎన్నికలపై ప్రత్యేకంగా ఫోకస్ పెడుతున్నాయి. సర్పంచ్ స్థానాలతో పాటు వార్డు ఉప సర్పంచ్ స్థానాలను గెలవాలని ప్లాన్ చేస్తున్నారు. గ్రామాల్లో కొంత పలుకుబడి ఉన్న నేతలను తమవైపునకు తిప్పుకునేందుకు పార్టీలు ప్రయత్నాలు మొదలు పెట్టాయి. ముఖ్యంగా అభివృద్ధి కార్యక్రమాలతో పాటు వ్యక్తిగత సహాయానికి దిగుతున్నారు. తమ అభ్యర్థిని సర్పంచ్‌గా గెలిపిస్తే భవిష్యత్తులో అండగా నిలుస్తామని ప్రధాన పార్టీల నేతలు పోటాపోటీగా హామీలు ఇస్తున్నారు.

ఎన్నికలకు ముందే సీఎం టూర్

పంచాయతీ ఎన్నికలకు ముందే సీఎం రేవంత్‌రెడ్డి జిల్లా పర్యటన షెడ్యూల్ ఖరారయ్యే అవకాశం కనిపిస్తుంది. ఈనెల 26న పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ రాకుంటే.. డిసెంబరు మొదటి వారంలో సీఎం పర్యటన ఉంటుందని తెలుస్తుంది. ఈ సందర్భంగా జిల్లాలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించి ప్రత్యేకంగా డ్వాక్రా మహిళలతో సీఎం ప్రత్యేక సమావేశం కానున్నట్లు తెలిసింది. ఒకవేళ పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయితే భారీ బహిరంగ సభను నిర్వహించాలని అధికార పార్టీ నేతలు భావిస్తున్నారు. ఎలాగైనా డిసెంబరు 4 లేదా 6వ తేదీల్లో సీఎం జిల్లా పర్యటన ఉంటుందని ఆ పార్టీ వర్గాల ద్వారా తెలుస్తుంది. ప్రజాపాలన వారోత్సవాల్లో భాగంగానే సీఎం జిల్లా పర్యటన ఉంటుందని అధికార వర్గాల ద్వారా కూడా తెలుస్తుంది. ఇప్పటికే డీసీసీ అధ్యక్షుల నియమకాన్ని చేపట్టిన కాంగ్రెస్ స్థానిక ఎన్నికలపై స్పెషల్ ఫోకస్ సారిస్తుంది. ఏదిఏమైనా పంచాయతీ ఎన్నికలకు ముందు జిల్లాలో సీఎం పర్యటించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.

ఐటీడీఏలో ఏజెన్సీ విద్యా శాఖను ఏర్పాటు చేయాలి : రాజ్‌గోండ్ సేవా సమితి

ఉట్నూర్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని గిరిజనుల సంక్షేమం అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఏజెన్సీ విద్యాశాఖను ఏర్పాటు చేయాలని రాజ్‌గోండు సేవా సమితి అధ్యక్షుడు, మాజీ ఎంపీ సోయం బాపురావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంగం విషంరావు, గోండు మహాసభ జాతీయ ఉపాధ్యక్షుడు సిడాం అర్జులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కేంద్రానికి జిల్లా ఇన్‌చార్జీ మంత్రి జూపల్లికృష్ణారావును కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉట్నూర్ ఐటీడీఏలో పూర్తి స్థాయి ఉద్యోగులను నియమించాలని, ఐటీడీఏలో ఏజెన్సీ విద్య శాఖను ఎత్తి వేయడం వల్ల గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధికి అన్యాయం జరుగుతుందని తిరిగి ఏజెన్సీ డీఈఓ కార్యాలయాన్ని పునరుద్ధరించాలని మంత్రిని కోరారు. అదేవిధంగా ఆదివాసీ యువతకు మహిళలకు ఉపాధి కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవడానికి రుణాలు అందించాలని ఉమ్మడి జిల్లాలోని జిల్లా కేంద్రాల్లో ఆదివాసీ స్టడి సర్కిల్ ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు. ఇదేకాకుండా ఆదివాసులకు ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని, రాయిసెంటర్ భవనాలకు నిధులు మంజూరు చేయాలని, ఆర్టీసీలో పూర్తి స్థాయి డ్రైవర్ కండక్టర్లను నియమించడంతో పాటు రెగ్యూలర్ డీఎంను నియమించాలని, ఆదివాసీ దేవస్థానాలకు పూజారులకు దూపదీప నైవేద్యాలు గౌరవ వేతనాలు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు పర్చే కేశవరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆనందరావు, కొమురంభీం జిల్లా గోండ్వాన పంచాయతీరాజ్ సెంటర్ జిల్లా మేడికుర్సెంగ మోతిరాం, రాజ్‌గోండు సేవా సమితి జిల్లా అధ్యక్షులు కురం జంగుపటేల్, రాజ్‌గోండు సేవా సమితి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వెడ్మకొద్దుపటేల్, తదితరులు పాల్గొన్నారు.



మంత్రి జూపల్లికి వినతిపత్రం అందజేస్తున్న సమితి సభ్యులు

శిశుగృహ పిల్లలకు స్వెటర్‌లు అందజేత

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : శిశుగృహలోని అనాధ పిల్లలకు శ్రీ జగదంబ ట్రేడర్స్ సహకారంతో ష్యూర్ ఎన్‌జీఓ ఆధ్వర్యంలో స్వెటర్‌లు, చద్దర్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమ ముఖ్య అతిథిగా డీసీపీఓ రాజేంద్రప్రసాద్ హాజరయ్యారు. శ్రీ జగదంబ ట్రేడర్స్ యజమాని యం.రాజ్ దంపతులు కలిసి శిశు గృహమేనేజర్ విజయలక్ష్మికి స్వెట్టర్‌లు అందించారు. కార్యక్రమంలో శిశు గృహ సిబ్బంది స్వప్న, డీసీపీయూ సిబ్బంది ప్రేమ్ కుమార్, ష్యూర్ ఎన్జీఓ జిల్లా కోఆర్డినేటర్ వినోద్, ఫీల్డ్ సూపర్‌వైజర్ సంపత్ కిరణ్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ చీరల పంపిణీ

బజార్ హత్నూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఇందిరా క్రాంతిపథం కార్యాలయంలో సహజ్యోతి మండల సమాఖ్య ఆధ్వర్యంలో ఏపీఎం వెంకట్ రెడ్డి, సమాఖ్య సభ్యులతో కలిసి సోమవారం ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. మండలంలో 6902 మహిళా సభ్యులకు చీరలు రాగా మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామ పంచాయతీల్లో మహిళలకు చీరల పంపిణీ ఉంటుందన్నారు. మహిళా సంఘాల సభ్యులు గ్రామాల్లో ఇందిరమ్మ చీరలు పంపిణి కొనసాగిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సీసీలు తొట్ల శంకర్, పురుషోత్తం, గంగయ్య, సంతోష్, స్వయం సహాయక సభ్యులు పాల్గొన్నారు.

నిజామాబాద్-బాసర రైలులో ల్యాప్ టాప్ చోరీ

» బాసరలో ఇద్దరు అరెస్టు

బాసర,నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : బాసర రైల్వేస్టేషన్ పరిసరాల్లో అనుమానస్పదంగా తిరుగుతున్న ఇద్దరు వ్యక్తులు(ఒక పరుషుడు, ఒక మహిళ)ను సోమవారం పోలీసులలు అదుపులోకి తీసుకున్నారు. విచారించగా, సుమారు లక్ష రూపాయల విలువైన దొంగలించబడిన లాప్‌టాప్‌ను స్వాదీనం చేసుకున్నారు. సోమవారం మద్యాహ్నం సుమారు ఒంటి గంట ప్రాంతంలో బాసర రైల్వేస్టేషన్ సమీపంలోని ఓ హోటల్ వద్ద ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. సదరు ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించగా, వారి వద్ద ఉన్న బ్యాగులో లక్ష రూపాయల విలువైన ఒక లాప్‌టాప్ పోలీసులకు లభించింది. దీనిపై వారు పొంతన లేని సమాధానాలు చెప్పడంతో పోలలీసులు తమదైన శైలిలో వివచించారు. నిజామాబాద్ నుండి తమదైన శైలిలో విచారించారు. నిజామాబాద్ నుంచి బాసర వస్తున్న రైలులో ప్రయాణికుడికి చెందిన లాప్‌టాప్ బ్యాగును తాము దొంగలించినట్లుగా నిందితులు అంగీకరించారు. వెంటనే రైల్వేపోలీసులకు సమాచారం అందించిన పోలీసుల, దొంగలించబడిన లాప్‌టాప్‌తో సహా ఆ ఇద్దరు వ్యక్తులను తరుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం రైల్వే పోలీసులకు అప్పగించినట్లు బాసర ఎస్సై సాయికిరణ్ తెలిపారు.



పోలీసుల అదుపులో యువకుడు

అనుమానాస్పద మృతి

మావల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఒకరి మృతి పై అనుమానాస్పద కేసు నమోదు చేసినట్లు మావల సీఐ స్వామి తెలిపారు.. ఆయన తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని సుభాష్ నగర్‌కి చెందిన పొటపడే అజయ్ (30) ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తుంటాడు. అజయ్ భార్య దీపాలి అదే కాలనీకి చెందిన ఓ వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకోవడతో తరచూ గొడవలు అయ్యేవి. ఈ క్రమంలో భార్య దీపాలి తల్లి గారింటికి వెళ్తున్న అని చెప్పి ఇంటి నుండి వెళ్లిపోయింది.. అయితే ఎప్పటి లాగే పని నిమిత్తం వెళ్లిన అజయ్ టీచర్స్ కాలనీ సమీపంలో మృతి చెంది ఉండటంతో స్థానికులు పోలీసులకి సమాచారం ఇచ్చారు. అయితే అజయ్ మృతిపై తమ్ముడు సునీల్ అనుమానం వ్యక్తం చేసి ఫిర్యాదు చేశాడు.. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఆడబిడ్డల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

» ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు

నిర్మల్‌చైన్‌గేట్/భైంసా రూరల్/భైంసా/బోథ్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఇండ్లు లేని పేదలందరికీ సొంతింటి కలను నెరవేర్చడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. సోమవారం భైంసా మండలం ఎగ్గాం గ్రామంలో కండేక కవిత, ధర్మపాల్ దంపతులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్లలో ఒకదాన్ని మంత్రి జూపల్లి కృష్ణారావు, ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్, ముథోల్, ఖానాపూర్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, వెడ్మ బొజ్జు పటేల్, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ఇళ్లు లేని పేద కుటుంబాల కోసం ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా ప్రతి అర్హత గల కుటుంబానికి రూ. 5 లక్షల ఆర్థిక సమాయం అందిస్తోంది. పేదల గృహ సాధన లక్ష్యంగా ప్రభుత్వం కట్టుబడి పని చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి, ప్రజాప్రతినిధులు లబ్ధిదారులను శాలువాతో సన్మానించారు. ప్రారంభోత్సవంలో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సాంకేత్ కుమార్, అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు. మండలంలోని ఎగ్గాం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లను రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక, ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఎమ్మెల్యే రామారావు పటేల్‌తో కలిసి ప్రారంభించారు. ఇందిరమ్మ ఇళ్లు పూర్తి చేసుకున్న కవిత ధర్మపాల్ లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించారు. ఇందిరమ్మ చీరను పంపిణీచేసి,లబ్ధిదారులు మీపిల్లలనుబాగా చదివించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, ఎమ్మెల్యే రామారావు పటేల్, అడిషనల్ కలెక్టర్ సాంకేత్ కుమార్, మాజీ ఎమ్మెల్యేవిఠల్‌రెడ్డి, మహిళా సంఘాల మహిళలు, డీఆర్‌డీవో విజయలక్ష్మి, ఎంపీ నా గేష్, అధికారులు, ప్రజాప్రతి నిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

రోడ్ల నిర్మాణానికి మంత్రి జూపల్లి శంకుస్థాపన

భైంసా నియోజక వర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో చేపట్టే రోడ్ల నిర్మాణానికి జిల్లా ఇంచార్జీ మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావ్ శంకుస్థాన చేశారు. సోమవారం భైంసా పట్టణ పరిధిలోని సేవాలాల్ చౌక్ వద్ద సంబంధిత రోడ్ల నిర్మాణానికి చెందిన మూడు శిలాఫలకాలను అవిష్కరించారు. ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యుడు జి. నగేష్, ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావ్ పాటిల్, మాజీ ఎమ్మెల్యేలు బోస్లే నారాయణరావ్ పాటిల్, జి.విఠల్ రెడ్డి, భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ సిందే ఆనంద్‌రావ్ పాటిల్, ఆత్మ కమిటీ చైర్మెన్లు సిద్ధం వివేక్,నర్సారెడ్డిలతో కలిసి ప్రారంభించారు.

ప్రతికార్యకర్త స్థానిక పోరులో విజయం సాధించే దిశగా పని చేయాలి

బోథ్‌లో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని జిల్లా ఇన్‌చార్జీ మంత్రి జూపల్లికృష్ణారావు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మంత్రి రానున్న ఎన్నికల్లో గెలుపు కోసం కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సహకార సంఘం డైరెక్టర్ ఎల్.పోశెట్టి, మాజీ సర్పంచ్ నరోత్తంరెడ్డితో పాటు పలు గ్రామాల కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

పత్తి రైతుల సమస్య పరిష్కారానికి కృషి

భైంసా, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): దిగుబడుల విక్రయ ప్రక్రియలో పత్తి రైతులు ఎదుర్కొంటున్న సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యుడు జి.నగేష్ వెల్లడించారు. సోమవారం భైంసాలో జిల్లా ఇంచార్జీ మంత్రి జూపల్లి చేపట్టిన పర్యటనలో ఎంపీ నగేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు పత్తి రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యను ఆయన దృష్టికి తీసుకవెళ్లారు. ఇందుకు స్పందించిన ఎంపీ నగేష్ సీసీఐ ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను త్వరితగతిన పరిష్కరింప చేసేందుకు చర్యలు చేపడుతామని తెలిపారు. సీసీఐ కేంద్రాలను ఎల్ -1,ఎల్-2, ఎల్ - 3 నిబంధన ప్రకారం ఏర్పాటు చేసి కొనుగోళ్లు చేపడుతోందని వివరించారు. పరిస్థితులకు అనుగుణంగా కేంద్రాలను పెంపొందింప చేసి కొనుగోళ్లలో పత్తి రైతులు ఎలాంటి ఇబ్బందుల బారిన పడకుండా కృషి చేస్తానని తెలిపారు. ఇందులో భాగంగానే భైంసా పట్టణ బీజేపీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రావుల రాము, శ్రీకాంత్ దగ్దే, మాజీ అధ్యక్షులు ఎనుపోతుల మల్లేశ్వర్, ప్రతినిధులు రావుల పోశెట్టి,గాలి రాజు,కాసర్ల ప్రవీణ్ కుమార్, సుభాష్, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ గౌతం పింగ్లే , మాజీ వైస్ చైర్మెన్ తోట లింగురామ్‌లతో కూడిన బీజేపీ బృందం ఎంపీ నగేష్‌ను కలిసి పలు విషయాలను చర్చించారు. భైంసా మున్సిపల్ పరిధిలో అవసరమైన అభివృద్ధి పనులను వివరాలను తెలిపారు.



మాట్లాడుతున్న పార్లమెంట్ సభ్యుడు నగేష్

దుబాయ్‌లో భర్త హత్య.. భార్యకు ప్రీ ప్రైమరీ టీచర్ ఉద్యోగం

సోన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు దుబాయ్‌లో హత్యకు గురైన ఒక తెలంగాణ కార్మికుడి భార్యకు ప్రభుత్వం నిర్మల్ జిల్లాలో ప్రీ ప్రైమరీ టీచర్ ఉద్యోగం ఇచ్చింది. ఇటీవల ఆమె హైదరాబాద్‌లోని సీఎం ప్రవాసి ప్రజావాణిలో, తెలంగాణ ప్రభుత్వ నియమిత ఎన్నారై అడ్వైజరీ కమిటీ వైస్ చైర్మన్ మంద భీమ్ రెడ్డిని కలిసి ఉద్యోగొ ఇవ్వాలని వినతి పత్రం సమర్పించిన నేపథ్యంలో సీఎంవో చొరవతో ఫైల్ వేగంగా కదిలింది. దుబాయ్‌లోని ఒక బేకరీలో సహోద్యోగి అయిన ఒక పాకిస్తాన్ ఉన్మాది చేతిలో ఏప్రిల్ 11న కత్తిపోట్లకు గురైన నిర్మల్ జిల్లా సోన్ మండల కేంద్రానికి చెందిన అష్టపు ప్రేమ్ సాగర్, జగిత్యాల జిల్లా ధర్మపురి మండల దుమ్మన్నపేటకు చెందిన స్వర్గం శ్రీనివాస్‌లు ప్రాణాలు కోల్పోయారు. మృతుడు అష్టపు ప్రేమ్ సాగర్ భార్య ప్రమీల సోమవారం నిర్మల్ జిల్లా సోన్ మండలం కూచన్‌పెల్లి ప్రభుత్వ పాఠశాలలో ప్రీ ప్రైమరీ టీచర్‌గా ఉద్యోగంలో చేరారు.

రైతుల సుభిక్షం కోసం రుద్రయాగం

బాసర, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : రైతులు సుభిక్షంగా ఉండాలని, దేశం సంస్కృతి సంప్రదాయాలకు నిలయంగా వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ బాసరలోని వేద భారతి పీఠంలో సోమవారం మహోత్తరమైన ఆధ్యాత్మిక కార్యక్రమం జరిగింది. జై జవాన్, జై కిసాన్ నినాదం మనకు ఊపిరి వంటిదని, వారి శ్రేయమే దేశ శ్రేయమని పీఠం నిర్వాహకులు ఈ సందర్భంగా తెలియజజేశారు. ఈ విశేష కార్యక్రమంలో భాగంగా, పీఠంలో కొలువై ఉన్న మహాదేవునికి ప్రత్యేకంగా అభిషేకము, అష్టోత్తర పూజ నిర్వహించారు. అటుపై, లోక కళ్యాణార్థం రైతన్నల ఆనందం కోసం రుద్రయాగం సంపూర్ణ శాస్త్రోక్తంగా నిర్వహించబడింది. కార్యక్రమం ముగింపులో, భక్తుల సమక్షంలో దేవదేవునికి సప్తహారతులు సమర్పించడం జరిగింది. వేద పీఠం స్వామిజీ మాట్లాడుతూ జై జవాన్, జై కిషాన్ మన ఊపిరి వంటి వారని, వారి శ్రేయస్సు కోసం నిత్యం పూజలు కొనసాగుతాయని తెలిపారు. ఇందులో భాగంగా, ప్రతి సోమవారం నాగు గోపూజ, హారతి కార్యక్రమాలు నిరాటంకంగా కొనసాగుతాయని ఆయన ప్రకటించారు.

దేశవ్యాప్త నిరసనను జయప్రదం చేయండి

● ఖానాపూర్‌లో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కరపత్రాల విడుదల

ఖానాపూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 26న దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్ కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం ఖానాపూర్‌లో సీఐటీయూ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కరపత్రాలు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు డాకూర్ తిరుపతి, జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు ఎస్. నారాయణ, బోసు భూమన్న, కమల, లక్ష్మీ, స్వామి, తదితరులున్నారు.

కాంగ్రెస్ ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలి

» పత్తి పంటను షరతులు లేకుండా సీసీఐ కొనుగోలు చేయాలి

» అర్హులైన బీడీ కార్మికులందరికీ రూ. 4,000ల పెన్షన్ ఇవ్వాలి

నిర్మల్ రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చినటువంటి ఆరు గ్యారంటీలు అమలు చేయాలని అలాగే అర్హులైన బీడీ కార్మికులందరికీ 4 వేల రూపాయల పెన్షన్ ఇవ్వాలని, షరతులు లేకుండా పత్తి పంటను సీసీఐ కొనుగోలు చేయాలని తదితర డిమాండ్లతో సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సోమవారం సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ ఉమ్మడి ఆదిలాబాద్ - నిర్మల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చలో కలెక్టరేట్ కార్యక్రమంలో భాగంగా సమీకృత కలెక్టరేట్ కార్యాలయం ఎదు ట ధర్నా చేపట్టారు. అనం తరం జాయింట్ కలెక్టర్ కిషోర్ కుమార్‌కు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజే శారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశిం చి మాస్ లైన్ పార్టీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి నంది రామయ్య మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి నా యకత్వంలోని కాంగ్రెస్ ప్రభు త్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్నప్పటికీ, ప్రభు త్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా మూడో సంవ త్సరంలోకి ప్రవేశించే తరుణంలో డిసెంబరు 9న సంబ రాలు జరుపుకోబోతోంది. రెండు వేల రూపాయల వృద్ధాప్య, వితం తుల పెన్షన్లు పెంచలేదు. అలాగే వికలాంగులకు రూ.3వేల నుంచి రూ.6 వేల పెంపు రైతు రుణాల రద్దు, ఆటో కార్మికులకు, వ్యవసా య కూలీలకు ఏడాదికి రూ. 12,000 జీవన భృతి, నిరుద్యో గులకు నెలకు రూ. 3,000ల నిరు ద్యోగ భృతి, పంటల కు బోనస్ సకాలంలో చెల్లించడం లాంటివి నోచుకోలేకపోయింది. అకాల వర్షాలతో పత్తి, సోయా, వరి, తదితర పంటలు తడిసిపోయి రైతులు లబోదిబోమంటూ వాపోతున్న తరుణంలో సీసీఐ అధికారులు దళారులతో కుమ్మక్కై రైతులకు తేమ పేరుతో మరింత నష్టాల్లోకి నెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఏ మాత్రం ఉపేక్షించ కుండా అర్హులైన బీడీ కార్మికులకు అందరికీ రూ. 4,000ల పెన్షన్ ఇవ్వాలని అలాగే దివ్యాంగులకు రూ. 3,000ల నుంచి 6,000లకు పెంచి ఇవ్వాలని, వృద్ధు లకు, వితంతులకు, ఒంటరి మహిళలకు పెన్షన్లు ఇవ్వా లని, రేషన్ కార్డు లేనివారికి రేషన్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్ర మంలో పీయూసీఐ జిల్లా అధ్యక్షులు బక్కన్న, ఏఐయూ కేఎస్ జిల్లా కార్యదర్శి మహేందర్, ఏఐయూకేఎస్ జిల్లా నాయ కులు జక్కుల రాజన్న, పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు కిరణ్,నాయకులు లక్ష్మీ, గంగామణి, పాల్గొన్నారు.



అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

నిరుపేదల సొంతింటి కలను నిజం చేశాం

● మంత్రి జూపల్లి

- మాది పేదల ప్రభుత్వం, పేదల సంక్షేమం కోసం కృషి చేస్తున్నాం
- చేసిన అప్పుల వడ్డీలు కట్టేందుకు ఇబ్బంది పడ్డాం
- సంక్షేమ పథకాలు ఆపేది లేదు

(5వ పేజీ తరువాయి....)

సోలార్‌పవర్ ప్లాంట్లు, పెట్రోల్ పంపుల ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, వెడ్మ బొజ్జు,డీసీసీబీ చైర్మన్ అడ్డి బోజరెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్‌లు రాజేశ్వర్, శ్యామలాదేవి, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి యువరాజ్, డీఆర్‌డీఓ రవీందర్,ప్రజా ప్రతినిధులు,అధికారులు పాల్గొన్నారు.

బోథ్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తుందని ఆనాడు ఇందిరమ్మ నుంచి ఈనాడు రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి ప్రజా సంక్షేమం కోసం పాటు పడుతున్నామన్నారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు తీవ్రంగా కృషి చేస్తుందన్నారు. గతంలో చేసిన అప్పులకు సంబంధించిన వడ్డీలు కట్టేందుకు రెండు సంవత్సరాలు మాప్రభుత్వం ఇబ్బందులకు గురవుతుందన్నారు. రూ.6500 కోట్లు వడ్డీలుగా చెల్లించాల్సి వస్తుందని అయితే 150000 అప్పు తీసుకొని వడ్డీలు కడుతు సంక్షేమ పథకాలను అమలు చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను నేరవేర్చే దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తుందని మహిళలను లక్ష అధికారులుగా చేయడమే లక్ష్యంతో ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారన్నారు. మహిళ సంఘాలకు ఆర్టీసీ బస్సులు ఇవ్వడంతో పాటు పెట్రోల్ పంపులు సోలార్ విద్యుత్ ప్లాంట్‌లు వారికి కేటాయించేందుకు కృషి చేస్తున్నామన్నారు. మరోవైపు రాష్ట్ర వ్యాప్తంగా రూ.22వేల కోట్లతో ఇందిరమ్మ ఇళ్లను ఇవ్వడం జరిగిందన్నారు. బోథ్ నియోజక వర్గంలో 3500 కేటాయించడం జరిగిందన్నారు. ఇండ్ల నిర్మాణంలో ఎవరైనా లంచం అడిగితే ఇవ్వవద్దని సూచించారు. పూర్తయిన ఇళ్లకు సకాలంలో బిల్లులు వచ్చే విధంగా చూస్తామన్నారు. సిలిండరుకు రావాల్సిన సబ్సిడీ విద్యుత్ సబ్సిడీలు అదే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఇంకా మహిళలు పేదరికంలో ఉన్నారంటే ప్రభుత్వ ఆసుపత్రులను కళాశాలను వినియోగించుకోలేక పోతున్నారనేది స్పష్టమవుతుందన్నారు. లక్షలరూపాయలు వెచ్చించి వైద్యం విద్యార్థులకు చదువు పై ప్రైవేట్‌లో చేయించడం వల్ల నష్టపోతున్నారు అన్నారు. మీలో అప్పులేని వారు ఉన్నారా ఉంటే చేయి లేపండని మంత్రి పేర్కొనగా మహిళలు ఎవరు చేయి పైకి లేపలేదు అంటే మీరంతా అప్పుల్లో ఉన్నారని అర్థమవుతుందన్నారు. ఆర్థిక అభివృద్ధికి ఆచితూచి ఖర్చులు చేయాలని ఆడంబరాలకు పోవద్దని పేర్కొన్నారు. సమావేశంలో ఎంపీ జి.నగేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జిల్లా అభివృద్ధి ఉపాధి హామీ నిధులను ఇవ్వడం జరుగుతుందన్నారు. అయితే జిల్లలో అనేక అభివృద్ధి పనులు ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేపట్టడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు అందిస్తున్న చీరలను వినియోగించుకోవాలని వాటిని పంట పొలాలకు కంచెలుగా మార్చొద్దని సూచించారు. గతంలో కొంత మంది మహిళలు బతుకమ్మ చీరలను గణేష్ దుర్గ మండపాలలో అలంకరణకు ఉపయోగించడం జరిగిందన్నారు. సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే జాదవ్ అనిల్ మాట్లాడుతూ నానియోజక వర్గం వైశాల్యంలో పెద్దదని అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న గ్రామాలు ఎన్నో ఉన్నాయి అన్నారు.అడవుల్లో రహదారులు లేక సరైన విద్యుత్ లేక ప్రజలు ఇబ్బందులు గురవుతున్నారని మంత్రికి వివరించారు. వాగులు వంకలు, కొండలు, గుట్టలు ఉన్న మా నియోజక వర్గంపై కరుణ చూపాలని మంత్రిని కోరారు. మరోవైపు బోథ్‌ను రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని డిగ్రీ కళాశాల ఇచ్చోడలో లేదా బోథ్‌లో డీఎస్పీ కార్యాలయం అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు.ఎందుకు సంబంధించిన ఫైల్స్ ముఖ్యమంత్రి దగ్గర ఉన్నాయని వీటి విషయంలో శ్రద్ధ చూపించాలని కోరారు. ఇక మహిళలు అధిక వడ్డీలకు అప్పులు తీసుకొని నష్టపోవద్దని సూచించారు.కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ రాజేశ్వర్ డీఆర్‌డీఓ పీడీ రాథోడ్ రవీందర్, ఆర్డీఓ స్రవంతి, డీపీఎం వెంకటస్వామి,ప్రసాద్,ఏపీఎం రతన్‌సింగ్,తహసీల్దార్ సుభాష్‌చంద్ర, ఎంపీడీఓ రమేష్, సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు అడ్డిభోజారెడ్డి, బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి

భవిష్యత్తులో తెలంగాణ రాష్ట్రంలోని అన్ని గ్రామాలలో మౌళిక వసతుల కల్పనకు కృషి చేస్తుందని రాష్ట్ర ఎక్సైజ్‌టూరిజం శాఖ మంత్రిజూపల్లికృష్ణారావు పేర్కొన్నారు. సోమవారం సోనాల మండల కేంద్రంలో నూతనంగా మంజూరైన రూ.93కోట్ల 6లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్థికంగా ఎన్ని కష్టాలు ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గ్రామాల అభివృద్ధి సంక్షేమ పథకాల అమలుకు కృషి చేస్తున్నారన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీ జి.గనగేష్, ఎమ్మెల్యే జాదవ్‌అనిల్, ప్రాజెక్టు అధికారి యువరాజ్ ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్, ఆర్డీఓ స్రవంతి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ గజేందర్, జాయింట్ కలెక్టర్ రాజేశ్వర్, పీడీ రాథోడ్‌రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



చెక్కులను అందిస్తున్న మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు

సీపీఆర్‌పై అవగాహన

మావల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల పోలీస్‌స్టేషన్‌లో పోలీస్ సిబ్బందికి సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. ఈ మేరకు అంకోలి డాక్టర్ ఆశా కిరణ్ (డెమో) ద్వారా సీపీఆర్ టెస్ట్ అత్యవ సర సమయంలో ఏ విధంగా చేస్తారో చూపించారు. ఎవరైనా వ్యక్తిమనకళ్ల ముందే అపస్మారక స్థితి లోకి వెళ్లినప్పుడు సడన్‌గా గుండె ఆగిపోయినట్లైతే సీపీ ఆర్ చేసి 85శాతం ప్రాణాలు రక్షించవచ్చన్నారు. ఆ తరువాత వ్యక్తిని వెంటనే 108ద్వారా రిమ్స్‌కు పంపి కాపాడు కోగలుగుతా మన్నారు. ఈ కార్య క్రమంలో మావల సీఐస్వామి, ఎస్సై రాజ శేఖర్, అంకోలి సూ పర్ వైజర్ ఆడే సురేష్, బొమ్మెత సుభాష్, జి.మేరీ, ఎంఎల్‌హెచ్‌పీ శిరీషా,సిబ్బంది పాల్గొన్నారు.



. మావల పోలీస్‌స్టేషన్‌లో..

క్రైం సమాచారం

ఆటో బోల్తా.. ఆరుగురికి గాయాలు

దిలావర్‌పూర్,నవంబరు 24 (ఆంధ్ర జ్యోతి):మండలంలోని న్యూలోలం- బీరవెల్లి రోడ్డుపై అదుపు తప్పిఆటో బోల్తా పడ్డ ప్రమాదంలో ఆరుగురు మహారాష్ట్ర వాసులు గాయపడ్డారు.బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని షివిని ప్రాంతానికి చెందిన కొన్ని కుటుంబాలు గుండంపల్లిలో నివాసముంటూ కూలీ పనులకు వెళ్తూ ఉపాధి పొందుతున్నారు.సోమవారం వారిలో కొంతమంది వారి స్వగ్రామానికి వెళ్లేందుకు ఆటోలో బయలు దేరారు. వెళ్లే క్రమంలో ఆటో న్యూలోలం - బీరవెల్లి రోడ్డు గుండా వెళ్తుండగా ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. కాజోల్, ధర్మేష్, రేఖ, రేణుకతో పాటు మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. వెంటనే 108 అంబులెన్స్ ఈఎంటీ ఆనంద్‌కుమార్, ఫైలట్ రణవీర్‌లు క్షతగాత్రులకు ప్రథమ చికిత్స చేసి నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలిం చారు.



గాయాలపాలైన బాధితులు

మహిళ మృతికి కారణమైన వ్యక్తికి పదేళ్ల జైలు

ఆదిలాబాద్‌టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి):మద్యంతాగి వాహనం నడిపి మహిళ మృతికి కారణమైన ఆటోడ్రైవర్‌కు 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.8500 జరిమానా విధిస్తూ అసిస్టెంట్ సెషన్స్ న్యాయాధికారి సీఎం రాజ్యలక్ష్మి తీర్పు వెలువరించారు. వివరాల్లోకి వెళ్తే... 2021 ఏడాదిలో బోథ్‌కు చెందిన పవర్ నిర్గుణ సోనాలలో కూరగాయలు అమ్మి తిరిగి వస్తున్న క్రమంలో... సోనాల ఆటోస్టాండ్ వద్ద మద్యం తాగి ఉన్న నేరస్తుడు షేక్‌జావిద్‌పాషా ఆటో ఎక్కారు.డ్రైవర్ మద్యం తాగి అజాగ్రత్తగా ఆటో నడపడంతో టీచీటీ గ్రామం వద్ద ఎదురుగావస్తున్న మరోఆటోని డీకొట్టాడు. ఈక్రమంలో ప్రయాణికులకు గాయాలు కాగా..పవర్ నిర్గుణ మృతి చెందారు. ఈ ఘటనపై మృతురాలి కొడుకు పవర్ అరవింద్ ఫిర్యాదు మేరకు బోథ్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి చార్జి షీట్ దాఖలు చేశారు. కోర్టు లైజన్ అధికారి, ఏఎస్సై వెంకటమ్మ, కోర్టుడ్యూటీ అధికారి శ్రీనివాస్‌లు 19 మంది సాక్షులను కోర్టులో హాజరు పరచగా..పీపీషహీనా సుల్తానా వాదనలు వినిపించి నేరం రుజువు చేశారు.వాదనలు విన్నఅసిస్టెంట్ సెషన్స్ న్యాయాధికారి సీఎం రాజ్యలక్ష్మి నేరస్తుడికి 10సంవత్సరాల కఠిన కారాగారశిక్ష, రూ.8500 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. కఠినమైన శిక్షలతోనే నేరాలను అదుపు చేయవచ్చని మద్యం తాగి వాహనాలు నడిపే వ్యక్తులపై కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు.

భీంపూర్‌లో ఇసుక అక్రమ రవాణా

భీంపూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుబిడి పెన్ గంగా నుంచి ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నప్పటికీ పట్టించుకునే అధికారులు కరువయ్యారు. ప్రతిరోజు దినంరాత్రి తేడా లేకుండా ట్రాక్టర్ లతో ఇసుకను అక్రమరవాణా చేస్తున్నారు. చుట్టూ పక్కల పరిసర గ్రామాలతో పాటు మహారాష్ట్ర నుంచి సైతం ట్రాక్టర్లతో అక్రమంగా రవాణా చేస్తున్నారు. గత కొద్ది రోజుల నుంచి బహిరంగ ఇసుక తరలిస్తున్నప్పటికీ అధికారులు మాత్రం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా సంబం ధిత ఉన్న తాధికారులు జోక్యం చేసుకొని పెన్ గంగ నది నుంచి తరలి పోతున్న ఇసుక అక్రమరవాణా అడ్డుకట్టవేయాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.



గుబుడిలో పెన్ గంగాలో నిల్వ చేసిన ఇసుక డంప్

అటవీ అధికారులపై దాడి చేసిన వ్యక్తులు అరెస్టు

నిర్మల్ రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): అటవీ అధికారులపై దాడి చేసిన వ్యక్తులను అరెస్టు చేసినట్లు రూరల్ ఎస్సై లింబాద్రి తెలిపారు.ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం మేడిపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు అన్నదమ్ములైన మారుతి, వెంకటేష్ అనేవారు ఈ నెల 21న వారిద్దరు కలిసి తమ ట్రాక్టర్‌లో మేడిపల్లి గ్రామ అటవీ ప్రాంతం నుంచి అక్రమంగా ఎటువంటి పర్మిషన్ లేకుండా ఇసుకను రవాణా చేస్తుండగా, మేడిపల్లి గ్రామం బీట్ అధికారి ట్రాక్టర్‌ను పట్టుకోగా, ఇద్దరు నేరస్తులు కలిసి బీట్ అధికారులపై దాడి చేసి వారి సెల్ ఫోన్ లాక్కొని దాన్ని ధ్వంసం చేసి బీట్ అధికారులను చంపుతామని బెదిరించారు. ఇట్టి విషయంలో ఫిర్యాదు రాగా రూరల్ స్టేషన్ ఆఫీసర్ కేసు నమోదు చేసి వారిని సోమవారం జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

విద్యుత్ స్థంబాన్ని ఢీకొట్టిన లారీ

బోథ్, నవంబరు24 (ఆంధ్రజ్యోతి):పొచ్చెరలో సోమవారం రాత్రి 7.30 గంటలకు ప్రాంతంలో గుర్తు తెలియని లారీరెండు విద్యుత్ స్థంబాలను ఢీకొట్టింది.స్థంబాలను ఢీకొట్టిన లారీ ఎవరిది అనేది తెలియకుండా పోయింది. ప్రమాదం జరిగిన సమయంలో విద్యుత్ సరఫరా లేక పోవడంతో పెద్ద ప్రాణాపాయం తప్పినట్లు అయింది. రోడ్డు పక్కన ఎవరైనా ఉంటే చనిపోయేవారని స్థానికులు అంటున్నారు. విషయం తెలిసిన వెంటనే విద్యుత్ శాఖ లైన్‌మెన్ రవి సంఘటన స్థలానికి చేరుకుని విద్యుత్ పునరుద్ధరించారు.



పొచ్చెరలో విద్యుత్ స్తంభ పడిన స్థలం

శ్మశాన వాటికకు దారి చూపండి

బోథ్, నవంబర్24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుశలాపూర్ గ్రామంలో ఉన్న శ్మశాన వాటికకు వెళ్లేదారి ఇరుకుగా ఉందని అయితే గ్రామంలోని కొంత మంది రైతుల పోలాలు ఉండడం వల్ల ఇబ్బందిగా ఉందని గ్రామస్థులు జిల్లా కలెక్టర్‌కు విన్నవించారు. ఈ విషయమై తగు చొరవ చూపించి శ్మశానవాటికకు వెళ్లే దారిని వెడల్పు అదే విధంగా చూడాలని సోమవారం ప్రజా ఫిర్యాదు విభాగంలో ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు.

సాయిలింగి వృద్ధాశ్రమంలో అన్నదానం

భీంపూర్,నవంబరు 24(ఆంధ్రజ్యోతి):తలమడుగు మండలంలోని సాయి లింగి వృద్ధాశ్రమంలో భీంపూర్ మండల కేంద్రానికి చెందిన జాదవ్ గంగాధర్ ఆయన తండ్రి జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులతో కలిసి వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. 16 ఏళ్ల క్రితం చనిపోయిన తన తండ్రి జ్ఞాపకార్థం ప్రతి ఏటా అన్నదాన కార్యక్రమలు నిర్వహిస్తున్నారు.అందులో భాగంగానే సాయి లింగి వృద్ధాశ్రమంలో సోమవారం వృద్ధులకు అన్నదానంతో పాటు దుస్తులు, పండ్లు,దుప్పట్లను పంపిణీ చేసి తన ఉదారతను చాటుకున్నారు ఈకార్యక్రమంలో భార్య జాదవ్ హంషబాయి,కూతుళ్ళు త్రివేణి, నిషా, ఉష, లావణ్య, కొడుకులు విశాల్, నవ్షిలాల్, అజయ్‌లు పాల్గొన్నారు.



దుప్పట్లు పంపిణీ చేస్తున్న గంగాధర్

కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు కృషి చేస్తా



డీసీసీ అధ్యక్షుడిని స్వాగతిస్తున్న మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్

బోథ్, నవంబర్ 24(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ పటిష్టత కోసం కృషి చేస్తానని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నరేష్‌జాదవ్ పేర్కొన్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా నియామకం అయిన అనంతరం మొదటి సారిగా ఆయన బోథ్‌కు రావడం జరిగింది.ఈ సందర్భంగా ఆయనను స్థానిక నాయకులు స్వాగతించి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూరానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని కోరారు. తాను పార్టీలో గ్రూప్ విభేధాలు లేకుండా చూడడంతో పాటు ఐక్యంగా పార్టీని అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బోథ్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రఫుల్ చందర్‌రెడ్డి, గడ్డంసురేందర్, పలు గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ డీసీసీ అధ్యక్షురాలికి సన్మానం



ఆసిఫాబాద్ డీసీసీ అధ్యక్షురాలు ఆత్రంసుగుణను సన్మానిస్తున్న జీసీసీచైర్మన్

ఉట్నూర్, నవంబర్ 24(ఆంధ్రజ్యోతి): కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ నూతన అధ్యక్షురాలిగా నియమితులు అయిన ఆత్రంసుగుణను గిరిజన సహకార సంస్థ చైర్మన్ కొట్నాక్ తిరుపతి శాలువాతో సన్మానించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నాయకులు, కార్యకర్తలు, మహిళ సంఘాల ప్రతినిధులు, అభిమానులు భారీ సంఖ్యలో చేరుకుని శుభాకాంక్షలు తెలిపారు.ఆదివాసీ, గిరిజన సంఘాల ప్రతినిధులు కూడా ఆమె గృహానికి చేరుకుని శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆత్రంసుగుణ మాట్లాడుతూ అధిష్టానం తన పై నమ్మకంతో జిల్లా అధ్యక్షులుగా బాధ్యతలు కట్టబెట్టిందని, సమర్థవంతంగా పని చేసి పార్టీని మరింత అభివృద్ధి చేస్తానని అన్నారు.

మెరిసిన మట్టిలోమాణిక్యం

ఉట్నూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): బాల్యం నుంచి క్రీడలపై మమకారం ఆదివాసీ యువకుడు లింగువిజయ్ ఆదివారం గోవాలో జరిగిన అంతర్‌రాష్ట్రాల క్రికెట్ టోర్నీలో ఆయన జట్టు విజయం సాధించడంతో సోమవారం ఛాంపియన్‌షిప్ సర్టిఫికెట్‌లు చైర్మన్ చేతుల మీదుగా అందుకున్నారు. మండలంలోని సాలెవాడ బి గ్రామ పంచాయతీకి చెందిన మాజీ సర్పంచ్ వజియ, బాధిరావు దంపతుల కుమారుడు మరపలింగు విజయ్ హైదరాబాద్‌లోని ఎన్ఎస్సీ క్రికెట్ అకాడమీలో శిక్షణ పొందుతున్నారు.డైరెక్టర్ లవ్‌కుమార్ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న మరపలింగు విజయ్ ఈనెల 19నుంచి 23 వరకు గోవాలో నిర్వహిస్తున్న కర్ణాటక, గోవా, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ అంతర్గత క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొని ఆదివారం జరిగిన ఫైనల్స్‌లో ఆంధ్ర ప్రదేశ్ జటుపై తెలంగాణ జట్టువిజయంసాధించడంతో సోమవారం ఆల్ ఇండియా క్రికెట్‌ఛాంపియన్‌షిప్ సర్టిఫికెట్‌ను చైర్మన్‌చేతుల మీ దుగా అందుకున్నారని బాజీరావు తెలిపారు.



సర్టిఫికెట్ తీసుకుంటున్న విజయ్

ఘనంగా సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాలు

ఉట్నూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాలు ఉట్నూర్ మండల కేంద్రంలోని శ్రీశారద విద్యా మందిరంలో భక్తి శ్రద్ధల మధ్య ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జీ, కొమురంభీం ఆసిఫాబాద్ డీసీసీ అధ్యక్షురాలు ఆత్రంసుగుణ ము ఖ్య అతిథిగా హాజరయ్యారు. భక్తులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. శ్రీశారదా విద్యామందిర్ నెలకొల్పి 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కరస్పాండెంట్ రాజేశ్వర్‌గురూజి దంపతులను సుగుణ ప్రత్యేకంగా సన్మానించారు. ఈ సందర్భం గా సుగుణ మాట్లాడుతూ శ్రీసత్యసాయి బాబా బోధనలు సమాజంలో ప్రేమ, సేవ, మానవతా విలువలను పెంపొందించాయన్నారు. ఆయన చూపించినసేవమార్గం ప్రతి వ్యక్తికి ఒకప్రేరణ అని సత్యం,ధర్మం, శాంతి, ప్రేమ, అహింస అనే ఐదు మూల సూత్రాలతో నడిచే జీవితంమాత్రమే నిజమైనఆధ్యాత్మికతకు ప్రతికఅన్నారు. బాబా చెప్పిన విధంగా మనం ఏస్థాయిలో ఉన్నా సమాజానికి సేవ చేయాలనే తపన ప్రతి ఒక్కరిలో ఉండాలని అన్నారు.శ్రీసత్యసాయి బాబాఆశ్రమాలు, విద్యా సంస్థలు, ఆసుపత్రులు, సేవా కార్యక్రమాలు లక్షలాది కుటుంబాలకు వెలుగును అందిస్తున్నాయన్నారు.ఈశతజయంతి వేడుకలు ఆయన చూపిన సేవస్ఫూర్తిని గుర్తు చేసుకునే పుణ్యక్షణాలు, ఆయనమార్గంలో ప్రతి ఒక్కరు నడవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు, మహిళలు, సత్యసాయి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ఆర్అండ్ విశ్రాంత భవనం వద్ద జరిగే రాష్ట్ర ఐదో మహాసభలను విజయవంతం చేయాలని సీఐటీయూ అనుబంధ తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జయలక్ష్మి కోరారు. సోమవారం సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మూడు రోజుల పాటు జరిగే మహాసభల వివరాలను తెలిపారు. అంగన్‌వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారానికి చేపట్టవలసిన పోరాటాలు, భవిష్యత్ కార్యాచరణపై మహాసభల్లో చర్చించనున్నట్లు పేర్కొన్నారు. పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

బీజేపీలో పలువురి చేరికలు

ఉట్నూర్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీలో సోమవారం పలువురు చేరారు. మండల కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితేష్‌రాథోడ్ నివాసంలో పలువురికి బీజేపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. భానోవత్ సంగీత, చౌహాన్ శాంత, సీనాబాయి, ఆడే మోబిలాల్, పవర్‌అశోక్, జాదవ్‌రాజునాయక్, జాదవ్‌దేవ్‌సింగ్, మరి కొందరు భారతీయ జనతా పార్టీలో చేరి కండువాలు కప్పుకున్నారు. ఈ సందర్భంగా రితేష్‌రాథోడ్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వం కేంద్రం ఇస్తున్న నిధుల నుంచి రాష్ట్రంలో అభివృద్ధి పనులు నడుస్తున్నాయని ప్రజలంతా గమనించి బీజేపీ పార్టీ బలపరిచిన సర్పంచ్, వార్డు సభ్యులకు ఓట్లు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ ఉట్నూర్ మండల అధ్యక్షుడు బింగి వెంకటేశ్, జిల్లా కార్యదర్శి కొండేరిరమేష్, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ టేకం హరిప్రసాద్, ఎస్టీ మోర్చా జిల్లా కార్యదర్శి రాథోడ్‌శేషారావు, సీపతి లింగాగౌడ్, బొడ్డుకిరణ్, కాల్వరవి, ఉగ్గేవిజయ్, చింతలరమణ, బి.జితేందర్, బూత్ అధ్యక్షుడు జాదవ్‌సతీస్, పులిశ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



బీజేపీలో ఆహ్వానిస్తున్న నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రాథోడ్‌రితేష్

రైతు సంక్షేమానికి బీఆర్ఎస్ కట్టుబడి ఉంది

● బీఆర్ఎస్ జిల్లా సీనియర్ నాయకుడు లింగారెడ్డి

జైనథ్, నవంబర్ 24 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఉద్యమం ద్వారా ఏర్పాటు చేయబడ్డ తెలంగాణ రాష్ట్రంలో గతంలో బీఆర్ఎస్ సీఎం కేసీఆర్ రైతు సంక్షేమానికి ఎల్లప్పుడు కట్టుబడి ఉందని బీఆర్ఎస్ ఆదిలాబాద్ జిల్లా సీనియర్ నాయకులు లింగారెడ్డి అన్నారు. సోమవారం జైనథ్ మండలంలోని కౌట గ్రా మంలో మాజీ సీఎం కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావ్, మాజీమంత్రి జోగురామన్న చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు.రైతులకు ఎకరానికి 13క్వింటాళ్ల పత్తి, ఎకరానికి సోయబీన్ 10 క్వింటాళ్లు కొనుగోలు చేయడం బీఆర్ఎస్ ఉద్యమ ఫలితమేనని అన్నారు. రైతులు తమ పంటను అమ్మడానికి తంబ్ తొలగించాలని, జిల్లా కలెక్టర్ ఆదేశాలు ఉన్న సోసైటీ అధికారులు అమ లు చేయడం లేదని ఆరోపించారు. రైతుబంధు రైతుబీమా పథకాలను అమలు చేసిన ఘనతమాజీ సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ యాసం నర్సింగ్‌రావ్, జైనథ్ మాజీ ఎంపీపీ ఎం.గోవర్ధన్, బీఆర్ఎస్ నాయకులు రుక్మన్న, కె.నర్సింగ్, సోసైటీ వైస్ చైర్మన్ కోరెడ్డి ఆనంద్‌రావ్‌లతో పాటు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కౌటలో మాజీ సీఎంచిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

సర్పంచ్ రిజర్వేషన్లలో బీసీలకు తీవ్ర అన్యాయం



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న బీసీ నేతలు

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): సర్పంచ్ ఎన్నికల రిజర్వేషన్‌లలో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు తీవ్ర అన్యాయం చేసిందని బీసీ నాయకులు ఆరోపించారు. ఈ విషయమై సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. 2019 లో జిల్లాలో బీసీలకు 23శాతం రిజర్వేషన్‌లు కల్పిస్తే.. ఈ సారి కేవలం 11శాతం మాత్రమే కల్పించారని, 83 గ్రామా పంచాయితీల స్థానంలో కేవలం 23 మాత్రమే బీసీలకు దక్కాయని అన్నారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ పేరిట 42 శాతం రిజర్వేషన్‌లు ఇస్తామని మోసం చేసిన ప్రభుత్వం... పాత రిజర్వేషన్ పద్దతి ప్రకారం కనీసం 23 శాతం రిజర్వేషన్‌లు సైతం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ధర్నాలో ముత్రా(కే) మాజీ సర్పంచ్ గాడ్గె మీనాక్షి, మాజీ ఎంపీటీసీ గాడ్గె సుభాష్, కిరణ్, వెంకట్ రావ్ వెంకటి, తులసిరాం, ఋషికేశ్ పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి ఒకరి మృతి

తలమడుగు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోనీ డోర్లీ గ్రామానికి చెందిన జలారపు లింగన్న (22) అనే యువకుడు పురుగుల మందు తాగిమృతి చెందినట్లు ఎస్సైరాధిక తెలిపారు. వివరాల ప్రకారం మండలంలోని డోర్లీ గ్రామానికి చెందిన లింగన్న తన తండ్రి పేరు మీద గల మూడు ఎకరాల 30 గుంటల భూమిలో కుటుంబ సభ్యులతో పాటు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. వ్యవసాయానికి తీసు కొచ్చి అప్పు దాదాపు మూడు లక్షల వరకు ఉంటుందన్నారు. వ్యవసాయ పొలంలో పత్తి పంట వేయగా భారీ వర్షాలకు పంట నష్టం జరిగిందని మనస్తాపం చెంది ఈనెల 23రోజున రాత్రి సమయంలో పురుగుల మందు తాగా స్పృహ తప్పిపోగ కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం రిమ్స్ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మరణించగా మృతుడి తల్లి జలారపు విమల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

విద్యుత్ సౌకర్యం కల్పించాలని ధర్నా



విద్యుత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న నేతలు

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): సీపీఐ సమీపంలో దాదాపు పదేండ్ల నుంచి గుడిసెలు వేసుకుని నివసిస్తున్న నిరుపేదలకు కనీస సౌకర్యాలు కల్పించడం లేదని సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు కట్ట కిష్ట స్వామి అన్నారు. కాలనీలో విద్యుత్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ సోమవారం విద్యుత్ శాఖ ఎస్ఈ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. నిషాన్ ఘాట్ లో దాదాపు పదేండ్ల నుంచి గుడిసెలు వేసుకుని జీవిస్తున్న నిరుపేదలు కనీస సౌకర్యాలు లేక ఇబ్బంది పడుతున్నారని కట్ట కిష్ట స్వామి పేర్కొన్నారు. ఈ విషయమై గతంలో అనేక మార్లు విన్నవించినా స్పందన లేదని, వెంటనే వారికి విద్యుత్ సౌకర్యం కల్పించేలా అధికారులు దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కట్ట చంద్రమౌళి, మెస్రం భాస్కర్, కేశవ్, కట్ట కిష్టయ్య, సంగీత, షబన, క్రిష్ట కాంబ్లే మారుతి, బాబ్లు పాల్గొన్నారు.

పల్లెపోరు.. రిజర్వేషన్లు ఖరారు

ఇచ్చోడనవంబరు24 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో రిజర్వేషన్ల లెక్క తేలింది. ఎవరు ఎక్కడ పోటీ చేయాలో ఖరారైంది. సర్పంచ్‌ల రిజర్వేషన్ల కేటాయింపు ఖరారు చేశారు. ఇచ్చోడ మండలంలో 33 గ్రామ పంచాయతీలో ఉన్నాయి. కోర్టు ఆదేశాల మేరకు రిజర్వేషన్లు 50శాతం మించకుండా స్థానాలు ఖరారు చేశారు. రిజర్వేషన్ల కుదింపుతో సర్పంచి స్థానాల్లో బీసీ మహిళలకు, బీసీ మహిళ/పురుషులకు, ఎస్సీ మహిళలకు ఎలాంటి స్థానాలు దక్కలేదు. జిల్లాలో షెడ్యూల్ ఏరియా(1/70 చట్టం పరిధి)లో ఉన్న సర్పంచి పదవులన్ని ఎస్టీలకు కేటాయించారు. వార్డుల్లో మాత్రం కొన్ని గిరిజనేతరులకు దక్కాయి. 2019లో నిర్వహించిన మొదటి సాధారణ ఎన్నికల్లో రిజర్వేషన్లు కల్పించిన పద్ధతినే అనుసరించినా రెండో సాధారణ ఎన్నికలకు రోటేషన్ పద్ధతి అనుసరించారు. పల్లెపోరుకు రిజర్వేషన్లు పూర్తిగా ఖరారవడంతో గ్రామాల్లో రాజకీయ వేడి మళ్లీ మొదలైంది.





ప్రజావాణిలో అర్జీలను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ శ్యామల దేవి

వినతుల పరిష్కారానికి సత్వర చర్యలు

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రజలు అందించే వినతుల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ శ్యామలాదేవి ఆదేశించారు. ప్రజావాణిలో భాగంగా సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన దరఖాస్తుదారుల అర్జీలను స్వీకరించి సంబంధిత శాఖల అధికారులకు విస్తృత సూచనలు చేశారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో వర్ణ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న ఇన్‌చార్జి ఏపీవో దామోదర్‌స్వామి

ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

▸ ఇన్‌చార్జి ఏపీవో జనరల్ దామోదరస్వామి

ఉట్నూర్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రతీ సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఉట్నూర్ సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ఇన్‌చార్జి ఏపీఓ జనరల్ దామోదరస్వామి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఐటీడీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలపై అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మంచిర్యాల మండలం కన్నెపల్లి గ్రామానికి చెందిన శంకర్ తనకు బొలెరో వాహనం మంజూరు చేయాలని, ఉట్నూర్ మండలం సాకెర గ్రామానికి చెందిన పద్మావతి తనకు ఏదైనా ఆశ్రమ పాఠశాలలో వర్కర్ ఉద్యోగం ఇప్పించమని, తలమడుగు మండలం మడిపల్లి గ్రామానికి చెందిన రాజు తనకు కిరణా దుకాణం ఏర్పాటు కోసం రుణం మంజూరు చేయాలని కోరుతూ దరకాస్తులు సమర్పించారు. అంతేకాకుండా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు పింఛన్, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని దరఖాస్తులు అందజేశారు. ఈ సందర్భంగా దామోదర స్వామి మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన దరఖాస్తులను సంబంధిత శాఖల సమన్వయంతో పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు 'బేస్' అభినందనలు

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): జల సంరక్షణలో గుర్తింపునకు గాను ఇటీవల రాష్ట్రపతి చేతుల మీదుగా ప్రతిష్టాత్మక అవార్డు స్వీకరించిన కలెక్టర్ రాజర్షిషా పనితీరుపై పలువురు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఇందులో భాగంగానే సోమవారం బేస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కేఆర్‌కే కాలనీలోని వృద్ధాశ్రమంలో అన్నదానం చేసి తమ అభిమానాన్ని చాటారు. జిల్లా అభివృద్ధికి కలెక్టర్ చేస్తున్న కృషి పట్ల సంస్థ సభ్యులు అభినందనలు తెలిపారు.

పంచాయతీ ఎన్నికలపై ప్రధాన పార్టీలు పట్టు భిగిస్తున్నాయి. రిజర్వేషన్లు ఖరారు కావడంతో ఎన్నికల బరిలో నిలిచేందుకు ఆశావహ నేతలు సిద్ధమవుతున్నారు. నేడో, రేపో నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఎన్నికల ప్రక్రియ మొదలు కావడంతో గ్రామా ల్లో పంచాయతీ ఎన్నికల సందడి కనిపిస్తుంది.



పంచాయతీపై ఫోకస్

ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్న ప్రధాన పార్టీలు

▸ జిల్లాలో దీటైన అభ్యర్థుల కోసం మొదలైన వేట
▸ పార్టీల వారీగా ఎన్నికల బరిలో సర్పంచ్ అభ్యర్థులు
▸ డిసెంబరు మొదటి వారంలో జిల్లాకు రానున్న సీఎం?
▸ రసవత్తరంగా మారుతున్న పంచాయతీ పోరు

ఆదిలాబాద్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 473 గ్రామ పంచాయతీలు, 3870 వార్డు స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. మూడు విడతల్లో ఎన్నికలను నిర్వహించేందుకు అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. ఈసారి ఎన్నికలు జరగడం ఖాయమని తేలిపోవడంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ బీజేపీలు పంచాయతీలపై ప్రత్యేకదృష్టిని సారిస్తున్నాయి. గ్రామస్థాయి నేతలతో సమావేశాలు నిర్వహిస్తూ గెలిచే అభ్యర్థులను బరిలో దింపాలని ప్లాన్ చేస్తున్నారు. మెజార్టీ సర్పంచ్ స్థానాలను గెలిచి తీరాలన్న పట్టుతో ప్రధాన పార్టీలు ఉన్నట్లు తెలుస్తుంది. అయితే పంచాయతీ ఎన్నికలు ఏ పార్టీకి అనుకూలంగా మారుతాయోనన్న చర్చ సాగుతోంది.

అభ్యర్థులపై ఆరా

పంచాయతీల వారీగా సర్పంచ్, వార్డు మెంబర్ రిజర్వేషన్లు ఖరారు కావడంతో సర్పంచ్ అభ్యర్థులపై ఆరా తీస్తున్నారు. ఎవరైతే గెలుస్తారంటూ పార్టీ కార్యకర్తల అభిప్రాయాలను సేకరిస్తున్నారు. మెజార్టీ కార్యకర్తల అభిప్రాయం మేరకే సర్పంచ్ అభ్యర్థులను బరిలో దింపాలని భావిస్తున్నారు. ఒక్కో గ్రామం నుంచి ముగ్గురు నలుగురు పేర్లను పరిశీలిస్తున్నారు. కులం, కుటుంబ బలం ఆర్థిక పలుకుబడి ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యతను ఇస్తున్నారు. అలాగే వ్యక్తిగత విషయాలను కూడా పరిగణలోకి తీసుకుంటున్నారు. అంతేకాకుండా గత ఎన్నికల్లో ఓటమి పాలైన అభ్యర్థులకు సానుభూతి కలిసి వచ్చే అవకా శం ఉండడంతో అలాంటి వారికి మళ్లీ అవకాశం కల్పించనున్నారు. పార్టీ బలంగా ఉన్న గ్రామాలపై మరింత ప్రత్యేక దృష్టిని సారిస్తున్నారు. ఎలాగైనా గెలిచి తీరాలన్న పట్టుతో ప్రధాన పార్టీలు ప్రయత్నాలు మొదలు పెట్టాయి.

పార్టీల మద్దతు

పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న వారికి పార్టీలు మద్దతుగా నిలుస్తున్నాయి. ఎలాంటి పార్టీ గుర్తు లేకపోయినా.. తమ పార్టీకి చెందిన

మిగతా.. 6లో



108లో తనిఖీ చేస్తున్న జిల్లా అధికారి

అంబులెన్స్‌ల తనిఖీ

ఉట్నూర్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జీవీకే ఈఎంఆర్ 108 డివిజన్ ఆఫీస్‌లో ఉమ్మడి జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ సాయ్రామ్‌ట్ సోమవారం అంబులెన్స్‌ల పనితీరుపై తనిఖీ నిర్వహించారు. ఉట్నూర్ 108, 102 అంబులెన్స్ వాహనాలను తనిఖీ చేసి రికార్డులను, వాహన నిర్వహణ, వైద్య పరికరాల పనితీరును పరిశీలించి వాటి ఉపయోగాల గురించి సిబ్బందికి అవగాహన కల్పించారు. గిరిజన ప్రాంతాలలో 108, 102 సిబ్బంది సేవలు, వైద్య సహాయం సంతృప్తికరంగా ఉండడంతో ప్రోగ్రాం మేనేజర్ సాయ్రామ్‌ట్ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా మేనేజర్ రాజశేఖర్, 108,102 సిబ్బంది గణేష్, దత్తాత్రేయ, ప్రవీణ్, రవీందర్, జాన్, రాజేందర్, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదల సొంతింటి కలను నిజం చేశాం

▸ అనుకుంట గ్రామంలో ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన మంత్రి జూపల్లి ▸ వరదలలో నష్టపోయిన కుటుంబాలకు త్వరలోనే నష్టపరిహారం అందిస్తాం ▸ ఎయిర్‌పోర్ట్ నిర్మాణ పనులను వేగవంతం చేస్తాం ▸ జిల్లాలో మంత్రి జూపల్లి విస్తృత పర్యటన

ఆదిలాబాద్ రూరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ అర్బన్ మండలంలోని అనుకుంట గ్రామంలో లబ్ధిదారులు బాస గంగమ్మ, ఆమె భర్త రమేష్‌లకు కేటాయించిన ఇందిరమ్మ ఇల్లును సోమవారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన మంత్రికి గ్రామస్థులు సంప్రదాయ పద్ధతిలో డప్పులతో స్వాగతం పలికారు. అలాగే లబ్ధిదారులను మంత్రి పట్టువస్త్రాలతో సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పేద కుటుంబాలకు గృహం కల్పించడం రాష్ట్ర ప్రభుత్వ అత్యంత ప్రాధాన్యత అంశమని తెలిపారు. అర్హులైన ప్రతీ కుటుంబానికి దశల వారీగా ఇళ్లు నిర్మించి అందిస్తామని భరోసా కల్పించారు. ఇందిరాగాంధీ కాలం నుంచే పేదల గృహ హక్కుల కోసం ప్రభుత్వాలు పని చేస్తున్నాయని, ఈ ప్రయాణాన్ని మరింత వేగవంతం చేస్తామని మంత్రి అన్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయని తెలిపారు. ఇంకా ఇళ్లు నిర్మించని అర్హులకు బ్యాంకులు, శ్రీనిధి, మహిళా సంఘాల (ఎస్‌హెచ్‌జీఎస్) ద్వారా సులభ రుణాలు అందించే విధానాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. ఆదిలాబాద్‌లో ఏయిర్‌పోర్టు నిర్మాణ పనులను వేగవంతం చేస్తామని ప్రకటించారు. గ్రామంలో రోడ్లు, వైకుంఠధామం, ఇతర ప్రజా అవసరాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తామన్నారు. ఇటీవల వరదలతో నష్టపోయిన కుటుంబాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి త్వరితగతిన సహాయం అందేలా చర్యలు చేపడతామని మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్, డీసీసీబీ చైర్మన్ భోజారెడ్డి, అదనపు కలెక్టర్‌లు రాజేశ్వర్, శ్యామల దేవి, ఐటీడీఏ పీవో యువరాజ్, ప్రజా ప్రతినిధులు, అధికారులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.



అనుకుంటలో లబ్ధిదారులతో కలిసి ఇందిరమ్మ ఇల్లును ప్రారంభిస్తున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి



పట్టణంలోని ఎస్టీయూ భవన్‌లో మహిళలకు చీరలు అందిస్తున్న మంత్రి జూపల్లి, చిత్రంలో ఎంపీ, ఎమ్మెల్యే

దివ్యాంగుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి : జూపల్లి

ఆదిలాబాద్ టౌన్: దివ్యాంగుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి పేర్కొన్నారు. పట్టణంలోని కైలాష్‌నగర్‌లో రూ.25 లక్షల వ్యయంతో నిర్మించిన దివ్యాంగుల సంఘ భవనాన్ని సోమవారం ప్రారంభించారు. ముందుగా శిలాఫలకాన్ని ఆవిష్కరించిన అనంతరం రిబ్బన్ కట్ చేసి భవనాన్ని ప్రారంభించారు. భవనం లోపలి గదులను పరిశీలించి అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. భవనాన్ని పరిశీలించారు. దివ్యాంగుల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని మంత్రి జూపల్లి తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని చర్యలు చేపట్టి దివ్యాంగులకు విద్య, ఉపాధి, స్వయం సమర్థతలో అవకాశాలు పెంపొందిస్తామని భరోసా ఇచ్చారు. కొత్తగా నిర్మించిన సంఘ భవనం దివ్యాంగుల సేవా కార్యక్రమాలు, సమావేశాలు, శిక్షణలకు వినియోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్, అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఐటీడీఏ పీవో యువరాజ్, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

ఆదిలాబాద్ టౌన్: మహిళల సాధికారత, ఆర్థిక స్వావలంబన కోసం రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని ఎస్టీయూ భవన్‌లో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం మహిళలకు చీరలు పంపిణీ చేశారు. మహిళా సంఘాలకు రూ.21.83 కోట్ల ఎస్‌హెచ్‌జీ రుణాల చెక్కులను మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ... మహిళలు గృహాలలో మాత్రమే కాకుండా, సమాజ నిర్మాణంలో, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బలోపేతంలో కీలకపాత్ర పోషిస్తున్నారని అన్నారు. మహిళలు గౌరవంతో, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేందుకు ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, రాష్ట్రంలో అమలు అవుతున్న పథకాలు ఇప్పటికే లక్షలాది కుటుంబాలకు ప్రయోజనం చేకూరుస్తున్నాయని వెల్లడించారు. మహిళల ఆదాయ వనరులను పెంపొందించేందుకు, యజమానులను చేసేందుకు ఆర్టీసీ బస్సులు,

(తరువాయి 7వ పేజీలో....)



అర్జీలను స్వీకరిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

ప్రజా ఫిర్యాదులపై తక్షణ చర్యలు

▸ ఫిర్యాదుల విభాగంలో ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రజలు అందించే ఫిర్యాదుల పట్ల తక్షణ చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. సోమవారం పోలీసు ముఖ్య కార్యాలయంలో నిర్వహించిన ఫిర్యాదుల విభాగంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా 14 మంది అర్జిదారులు తమ సమస్యలను విన్నవించగా వాటి పరిష్కారానికి తీసుకోవలసిన చర్యలపై సంబంధిత పోలీసు అధికారులకు ఎస్పీ సూచనలు చేశారు. ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం అయినా పోలీసులకు అందించాలని, వారి వివరాలు గోప్యంగా ఉంటాయని ఈ సందర్భంగా ఎస్పీ తెలిపారు. సీసీ కొండ రాజు, ప్రజా ఫిర్యాదుల విభాగం అధికారిణి కవిత జైస్వాల్ పాల్గొన్నారు.

తగ్గుతున్న చలి ప్రభావం

▸ అత్యల్పంగా సోనాలలో 14.0 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు

ఆదిలాబాద్, నవంబర్ 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు పెరగడంతో చలి ప్రభావం తగ్గుముఖం పడుతోంది. గత మూడు, నాలుగు రోజులుగా కనిష్ఠ ఉష్ణోగ్రతల పెరుగుదల కనిపిస్తుంది. సోమవారం జిల్లా సగటు గరిష్ఠ ఉష్ణోగ్రతలు 33.3 కాగా, కనిష్ఠంగా 15.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అలాగే అత్యల్పంగా సోనాల మండలలో 14.0, బేలో 14.3, గాదిగూడలో 14.6, నార్నూర్ 14.7, బీంపూర్ మండలం అర్లి(టి)లో 15.0 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇన్నాళ్లు చలి తీవ్రతతో ఇబ్బందులు పడిన జనం.. చలి తగ్గిందంటూ ఊపిరి పీల్చుకుంటున్నారు.

ఇందిరా మహిళా శక్తి చీరలు.. మహిళల ఆత్మ గౌరవానికి ప్రతీక

▸ ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్
▸ ఇంద్రవెల్లి, ఉట్నూర్‌లలో మహిళలకు చీరల పంపిణీ

ఇంద్రవెల్లి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఇందిరా మహిళా శక్తి చీరలు రాష్ట్రంలోని మహిళల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తున్నాయని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని స్థానిక ఐకేపీ కార్యాలయం ఆవరణలో మహిళలకు ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ చీరల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మహిళలకు చీరల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడారు. ఇందులో రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరీబాయి, తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ ముఖడే ఉత్తం, డీపీఎం మల్లేష్, ఐకేపీ ఏపీఎం మంజుల, తదితరులు పాల్గొన్నారు.

ఉట్నూర్: కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, ఈ ప్రభుత్వంలోనే సంక్షేమ పథకాలు అమలు చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళ శక్తి చీరల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మహిళలకు చీరలు పంపిణీ చేసిన సందర్భంగా మాట్లాడారు. అలాగే, మండలంలోని శ్యాంపూర్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో ఇందిరా మహిళా శక్తి మహిళ స్వయం సహాయక సంఘం సభ్యులకు చీరల పంపిణీ చేశారు.



ఇంద్రవెల్లిలో చీరలు పంపిణీ చేస్తున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు ఈశ్వరీబాయి



శ్యామ్‌పూర్‌లో చీరలు పంపిణీ చేస్తున్న దృశ్యం



ఎమ్మెల్యే అనిల్‌కు వినతిపత్రం అందజేస్తున్న సాదులగుట్ట గ్రామస్థులు

గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి :బోథ్ ఎమ్మెల్యే

నేరడిగొండ, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): బోథ్ నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల తక్షణ పరిష్కారమే తన ప్రధాన ఎజెండా అని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ స్పష్టం చేశారు. సోమవారం మండల కేంద్రంలో గల తన నివాసంలో ఇచ్చోడ మండలంలోని సాదులగుట్ట వాసులు ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను కలిసి పలు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తానని అన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

తలమడుగులో శిక్షణ కలెక్టర్ల పర్యటన

▸ ప్రభుత్వ పథకాల పనితీరుపై పరిశీలన

తలమడుగు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లాకు శిక్షణ కోసం వచ్చిన ట్రైనింగ్ కలెక్టర్‌లు సోమవారం మండలంలో పర్యటించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలపై ఆరా తీసి వాటి పనితీరు పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేవపెట్టిన పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందించాలన్నారు. ఇందులో ఎంపీడీవో శంకర్, ఎంపీవో వినోద్, మండల వ్యవసాయ అధికారి ప్రమోద్‌రెడ్డి, పశు వైద్య అధికారి డాక్టర్ లావణ్య, ఎంఈవో వెంకట్‌రావు, పంచాయితీ సెక్రటరీ వినోద్ తదితరులు పాల్గొన్నారు.



దేవాపూర్‌లో అధికారులతో మాట్లాడుతున్న శిక్షణ అధికారులు